


# ప్రముఖాంధ్ర

**ప్రపంచ తెలుగుల మానస పత్రిక**

నవంబర్ 2019

సంపుటి : 25 **299** సంచిక : 11




## తెలుగుకున్న 'వెలుగు'ను చీల్చాలనుకోవడం చీకటిని కొనితెచ్చుకోవడమే!

## మన భాష తెలుగు, మన దేశము తెలుగు, మనం తెలుగు!

మన జాతి తెలుగు, మనం జన్మించిన పుడమి తెలుగు. పచ్చని చేలములు, ఫలసాయపు ప్రకృతీ వనరులు, పాడినిచ్చే కామధేనువులు వంటి గోవులూ, జీవనదులూ, అన్నీ తెలుగు ప్రాంతంలోనే అధికంగా ఉన్నాయ్. మేధావులైన వారెక్కువగా తెలుగులోనే పుట్టారు. రామరాజ్య స్థాపకుడైన శ్రీరామచంద్రుడు తెలుగు కోసల రాజ్య తనయయైన కౌసల్యకే జన్మించాడు. గౌతమబుద్ధుడూ, అతని పరివారమూ ఎక్కువగా తెలుగు ప్రదేశాల్లోనే సంచరించారు.

త్రిలిఙ్గ దేశంగా వర్ధిల్లిన తెలుగు దేశం సంవృద్ధికీ, సమైక్యతకూ చిహ్నములుగా మంగళకరుడైన శివుడు ఇటు రాయలేలిన శ్రీశైలం, ఆంధ్ర రాజులేలిన ద్రాక్షారాం, తెలుగువారు నలిగి పిగిలిన తెలంగాణా ప్రాంతం కాళేశ్వరమ్ములలో వెలసి, మీకందరికి శుభమగునట్లు వెలిశామన్నారు. మా ముప్పురి కలయికనే త్రిలింగ, తెలుంగు దేశం పుట్టిందన్నారు.

వాగ్గేయకార భక్తితత్వాన్ని కొనితెచ్చిన అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసులు మూడు వేర్వేరు ప్రాంతాలలో పుట్టి, యావత్తెలుగు ప్రాంతాన్నీ భక్తిపునీతం చేశారు. మహాభారతము నాంధ్రీకరించిన కవిత్రయం మూడు ప్రాంతాల్లో పుట్టి ఏక మహాభారత గ్రంథానికి రచయితలయ్యారు. గోదావరి, కృష్ణా, నదులు తెలుగు ప్రాంతాల్లోనూ ప్రవహిస్తూ, సస్యశ్యామలకోమలం చేస్తున్నాయ్. ఇవన్నీ గ్రహించిన బ్రిటిషువారు నాణెములపై, కరెన్సీ నోట్లపై తెలుగుకే ప్రాధాన్యమిచ్చారు.

'చేయెత్తి జైకొట్టు తెలుగోడా – గతమెంతో ఘనకీర్తి కలవోడ' అంటూ అభ్యుదయ కవి శ్రీకృష్ణ, తల్లి ఒకటి, మనకు తెలుగోడ – అంటూ తరిమి తరిమినట్టు సందేశమిచ్చారు. తరుఫ్ ముక్కల్లాంటి భావాలు తెలుగు నాయకల తలల్లో దూరి, 'ముక్కలు చెక్కలుగ చేసే దురదృష్టకర రోజులు రాగలవని ఆయనెరుంగునేమో! ఈ పీడబుద్ధులు జనించకుండానే – ఓం నమశ్శివాయ సిద్ధం నమః' అంటూ అక్షర ప్రారంభం చేస్తూ, అక్షరం దిద్దించిన కారణం అందుకేనేమో!

కానీ ఇప్పుడెవరూ అక్షరాలు దిద్దేవారు (ఉంటే అరకొరా ఉన్నారేమో) లేరేమో! తెలుగుల బుద్ధులు వక్రిస్తున్నాయ్. ఏకచ్ఛత్రాధిపత్యంగా భారత దేశం ఏలవలసినవారు, పిల్ల కాలువల్లోని కాగిత పడవులందు ప్రయాణం చేయాలని చూస్తున్నారు.

స్వాతంత్ర్య సముపార్జనకు పూర్వమే తెలుగు రాష్ట్రం ఏర్పరచుకోవాలని, ఆరాటపడిన వీరు, భాషనెప్పుడో మరచిపోగా, ఏక రాష్ట్రాన్ని చీల్చుకోవాలని చూస్తుండటం విచారకరంగా ఉంది.

ప్రపంచ మాతాపితరులైన పార్వతీ పరమేశ్వరులు తెలుగువారి సంరక్షణ కోసమా ప్రాంతాల్లో వెలసి, తెలుగును విశ్వవిఖ్యాతం చేసి, తెలుగు విబుధులు విశ్వమంతటా వసించేట్టు అనుగ్రహించారు. వారందరూ నడుము కట్టి, ముక్తకంఠంతో తెలుగు వెలుగును చీల్చకుండా, చీకట్లపాలు కాకుండా చేయెత్తి జై కొట్టు తెలుగు వాడా– గతమెంతో ఘనకీర్తి కలవోడా అంటూ గత తెలుగు వైభవాన్ని తెలియచేయాలి, సమైక్య తెలుగు రాష్ట్రాన్ని వర్ధిల్ల చేయాలి. చీకట్లను చెండాడాలి.



*బుధజన విధేయుడు*

***– గోటేటి శ్రీరామారావు***

**(మే 2007, ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# పంచాయతనం

పంచాయతనం అంటే ఐదుగురు దేవతా మూర్తులున్న పీఠం. ఆదిత్యుడు, అంబిక, విష్ణువు, గణపతి, పరమేశ్వరుడు. మూర్తులంటే విగ్రహాలు కావు. ఆయా దేవతలకు ప్రతిరూపాలుగా భావించే శిలలు.

ఆదిత్యుడికి ప్రతి రూపం స్ఫటికం. గోళీకాయంత ప్రమాణంలో ఉండే స్ఫటికం సూర్యునిగా పూజలందుకుంటుంది.

అంబికకు ప్రతిరూపం నాపరాయి వలే ఉంటుంది. ఇందులో సువర్ణం ఉంటుందంటారు. కొన్ని నాపరాళ్లలో బంగరు రంగు గీతలుంటాయన్నది విదితమే కదా! దీనిని చంద్రశిల అంటారు.

విష్ణువు సాలగ్రామ రూపంలో ఉంటాడని అందరికే తెలిసిన విషయమే. ఇందులో జీవశక్తి ఉంటుంది. ఈ సాలగ్రామాలు ఉత్తరాన, హిమాలయాల్లో ప్రవహించే గండకీ నదిలో లభ్యమౌతాయి.

గణపతి జేగురు రంగులో ఉండే శిలలో ఉంటాడు. ఇవి శోణా నదిలో ఉంటాయి. శోణం అంటే ఎరుపు, లేదా అగ్ని వర్ణం. శోణానది మైనాక పర్వతంలో పుట్టి గంగలో కలుస్తుంది. ఈ నదిలో లభించే శిలలను శోణభద్ర వినాయక మూర్తులని అంటారు.

మహేశ్వరుడు బాణలింగ రూపంలో పూజలందుకుంటాడు. ఇది కూడా చిహ్న రూపమే. బాణలింగాలు నర్మదా నదిలో లభిస్తాయి. ఇవి శివలింగాకృతిలో ఉంటాయి.

పంచాయతనం పూజా గృహాల్లోనూ, దేవతార్చనా మందిరాల్లోనూ ఉంటుంది. కొన్ని గర్భ గుడుల్లో కూడా ఉంటాయి. కానీ గుళ్ళల్లో ఉన్న పంచాయతనంలో విగ్రహాలుంటాయి. తిరుమలలో, శ్రీశైలంలో, కాళహస్తిలో పంచాయతనాలు లేవు. మూల విరాట్టులు మాత్రమే ఉంటారు. గృహస్థులు ఎచటికేగినా పంచాయతనాన్ని తమ వెంట తీసుకుని వెళ్లి పూజలు చెయ్యాలి. మధ్యలో ఉన్న శిలను బట్టి పంచాయతనానికి పేరు ఉంటుంది.

ఉదాహరణ:

విష్ణుపంచాయతనం అంటే సాలగ్రామం మధ్యలో ఉంటుంది.

పంచాయతనం అంటే ఏమిటి?

'ఆయతన'మంటే ఆకారం.

'పంచాయతన'మనగా అయిదు ఆకారాలు గల పరమాత్మ.

పేరు పంచాతనుడు.

ఆయన పూజ పంచాయతన పూజ.

ఈ పూజలో శివ, విష్ణు, దేవి, గణపతి, సూర్య ఆకారాలలో పరమాత్మను ఒకేసారి అర్చన చేస్తారు.

ఈ ఐదు ఆకారాలు పరమాత్మ ఆకారాలే అనే జ్ఞానంతో చేసే అర్చన పంచాయతన అర్చన.

ఈ ఐదు ఆకారాలే ఎందుకు తీసుకోవాలంటే లోకంలో ఈ ఐదురకాల ఆకారాల మీదనే ప్రధానంగా ప్రతి విశేషము వుంటుంది. దేవతల పేర్లు చాలా వున్నా, ఈ దేవతలకే ప్రధాన దేవతలన్న ప్రశస్తి ఉపనిషత్తులలోను, పురాణాలలోను ఏర్పడివుంది. మంత్ర శాస్త్రంలోని మంత్రాలన్నీ కూడా, ఈ ఐదు దేవతల ఆధారంగానే విభజన చేయబడి వున్నాయి.

ఈ కారణాలవల్ల ఈ ఐదు దేవతలనే స్వీకరించి పంచాయతన పూజా విధానాన్ని రచించటం జరిగింది.

పంచాయతనం అంటే ఏమిటి? శంకరులు ఎందుకని పంచాయతనానికి ప్రాముఖ్యాన్ని ఇచ్చారు?

తేజస్సు పృథ్వి జలము కలిసి మహాగణపతి అనుకున్నాం. దివ్యులు అంటే దేవతలు లేదా దేవుళ్ళు వీరందరూ పేర్లు వేరైనా బ్రహ్మతత్త్వమూ, పరబ్రహ్మతత్త్వమూ తెలుసుకుంటే ఉన్నది ఒక్కటేనని తెలుస్తుంది. అలా తెలుసుకోగలగాంలటే పూర్వజన్మ సుకృతమూ అనేక జన్మల సాధనా, జ్ఞానమూ, దైవకృప కావాలి ! ఇవి అందరికీ ఉండవు గనుక అందరికీ పనికి వచ్చేలా మన మూర్తి లేదా విగ్రహ పూజను పెద్దలు మనకు అందించారు. శివుడు గొప్పా?, విష్ణువు గొప్పా? లేదా అమ్మవారిని పూజించాలా? అన్న సమస్యలు అందరికీ కలుగుతూ వుంటాయి. ఇలాటి సమస్యకు పరిష్కారంగా శివుడు, విష్ణువు, సూర్యుడు. గణపతి, అమ్మవారు ఈ అయిదు స్వరూపాలను ఒక్కచోట పెట్టి ఒక్కలాగ ఆరాధించే పద్ధతిని ఆదిశంకరులు మనకు అనుగ్రహించారు. ●

# ఆదివారం నాడు ఏం చేయకూడదో చెప్పిన వేదాలలోని శ్లోకం...

**అమిషం మధుపానం చ యః కరోతి రవేర్దినే ।**
**సప్తజన్మ భవేద్రోగీ జన్మ జన్మ దరిద్రతా ॥**
**స్త్రీ తైల మధుమాంసాని యే త్యజంతి రవేర్దినే ।**
**న వ్యాధి శోక దారిద్ర్యం, సూర్యలోకం స గచ్ఛతి ॥**

**తాత్పర్యం:** మాంసం తినడం, మద్యం తాగడం, స్త్రీతో సాంగత్యం, తలకు నూనె పెట్టుకోవడం ఇలాంటివి ఆదివారం నాడు నిషేధించిన కర్మలు. ఇలా చేసినవాడు జన్మ జన్మలకు దరిద్రుడు అవుతాడు అని నొక్కి వక్కాణించాయి. దారిద్ర్యం అంటే డబ్బు లేకపోవడం ఒక్కటే కాదు ఆనారోగ్యం కూడా. అలాంటి పవిత్రమైన రోజు తాగుబోతులకి తిండిపోతులకి ఇష్టమైన రోజు అయింది. మన సనాతన ధర్మంలో పురాణ ఇతిహాసాల్లో ఏ రోజుకి ఇవ్వని ప్రాధాన్యత ఆదివారానికి ఇచ్చారు. ఎందుకంటే అనాదిగా మన వాళ్ళందరూ సూర్యోపాసకులు. సూర్యుణ్ని ఆరాధించే సంస్కృతి మన భారతీయ హైందవ సంస్కృతి. అందుకే మనకొచ్చే ముఖ్యమైన పండుగలన్నీ కూడా సౌరమానం అంటే సూర్యుని ఆధారంగానే వస్తాయి. ప్రాతఃకాలంలో నిద్రలేచి సూర్య నమస్కారాలు, సంధ్యావందనాలు లాంటి హిందుకర్మలు సూర్యుణ్ని ఆరాధించే పద్ధతిలో ముఖ్యమైనవి. ఇలాంటి



ఆదివారం మనకి చాలా పవిత్రమైన రోజు. అలాంటి ఆదివారాన్ని వీకెండ్ పేరుతో, ఆదివారం సెలవు అనే పేరుతో అపవిత్రపాలు చేశారు. మనది భిన్నత్వంలో ఏకత్వం అనే సంస్కృతి అని అందరికీ తెలుసు. ఎన్ని ఆచారాలు సంస్కృతులు భిన్నంగా ఉన్న మన అందరిది హిందూ ధర్మమే అనే ఏకత్వన్నీ తెలిపేది మన హైందవ సంస్కృతి. అది చూసి తట్టుకోలేక బ్రిటీషువాడు Thomas Babington Macaulay - ప్రయోగించిన బ్రహ్మాస్త్రమే ఆదివారం సెలవు. మన హిందువులే మన సంస్కృతిని నాశనం చేసేలా చేశారు. మన హిందువులు ఆదివారాన్ని పరమ పవిత్రంగా భావించేవారు. ఆరోజు జీవహింస చేసి మాంసాన్ని తినే వారు కాదు, మద్యాన్ని తాగే వారు కాదు. కానీ ఇప్పుడు సీన్ అంతా రివర్స్ అయ్యింది. ఈ పోస్టు హిందూ సోదరులకు ఉత్సాహాన్ని మరియు నిరుత్సాహాన్ని ఇచ్చి ఉంటుంది. దీన్ని పాటించడానికి ప్రయత్నించండి...

**ఓం నమః శివాయ**

# కవిసామ్రాట్ మనసు దోచిన నెరజాణ - 'కిన్నెరసాని'

- భావరాజు పద్మిని



తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కవిసామ్రాట్, 'విశ్వనాథ సత్యనారాయణ' గారు. వీరు రాసిన 'కిన్నెరసాని పాటలు' తెలుగువారి గుండెల్లో సుస్థిరంగా నిలిచిపోయాయి. అసలు ఎవరీ కిన్నెరసాని? ఆమెకూ విశ్వనాథ వారికీ ఉన్న సంబంధం ఏమిటి అన్న విషయాలు తెలుసుకుందాము.

వరంగల్ జిల్లాలోని మేడారం–తాడ్వాయి కొండసానువులలో పుట్టిన చిన్న వాగు కిన్నెరసాని. 96 కిలోమీటర్ల పాటు ఈ వాగు అడవి, కొండ దారుల్లో ప్రవహించి భద్రాచలం వద్ద గోదావరిలో కలుస్తుంది. భద్రాచలం వద్ద ఉన్న పాల్వంచకు సమీపంలో ఉన్న 'యానంబయలు' అనే గ్రామం వద్ద కిన్నెరసాని ఒక గుట్టను చుట్టుకుని ప్రవహిస్తున్నట్టుగా ఉంటుంది. అక్కడ 1966 లో 'కిన్నెరసాని డాం' ను కూడా నిర్మించారు. అక్కడనుంచి నది మధ్యలో కనిపించే ఈ గుట్టను చూడవచ్చు కూడా!

విశ్వనాథ గారి బాల్యంలో వారి తండ్రిగారైన శోభనాద్రి గారు, ఈ కిన్నెర సాని వాగుకు అవతల ఉన్న ఒక గ్రామంలో భూమిని కౌలుకు తీసుకున్నారట. వ్యవసాయం చేసేందుకు అక్కడకు రోజూ తండ్రితో పాటుగా ఆ వాగు దాటి వెళ్ళే విశ్వనాథ వారు కొండదారుల్లో కిన్నెరసాని సోయగాలకు మైమరచిపోయి, దానితో ప్రేమలో పడిపోయారు. ఆ వాగునే తన ప్రణయినిగా, కావ్యనాయికగా భావించుకుని, 'కిన్నెరసాని పాటలు' అనే కవితా సంపుటిని రచించారు. రేడియో ద్వారా, అనేక పత్రికల ద్వారా ప్రజల్లోకి వెళ్ళిన ఈ పాటలను రసహృదయులు విపరీతంగా ఆదరించారు.

ఒక కవి చేసే కల్పనలలో జీవం రావాలంటే, తాను ఆయా పాత్రల్లో పరకాయప్రవేశం చెయ్యాలి. నదిని స్త్రీగా భావించడం, నదీ గమనాన్ని స్త్రీ జీవితంతో పోల్చడం సహజమే! కాని, ఈ నది చుట్టుకుని ప్రవహించే గుట్టను ఆమె భర్తగా భావిస్తూ హృద్యమైన రచన చెయ్యడం ఒక అద్భుతం. ఈ అద్భుతానికి ఆలంబన కిన్నెరసాని గురించి అక్కడి జానపదులు చెప్పుకునే ఒక పుక్కిటి కథ అంటారు. ఆ కథ ఏమిటంటే, 'కిన్నెర అనే ఒక దొరసాని, అత్తగారు తనను అన్న తప్పుడుమాటను, భర్త ఖండించలేదని నొచ్చుకుని, ఇల్లు వదిలి అడవులకు వెళ్ళిపోతుంది. తల్లి మాటలకు ఎదురు చెప్పలేనివాడు, భార్యను ప్రాణప్రదంగా ప్రేమించేవాడు అయిన ఆమె భర్త ఆమెను వెతుక్కుంటూ వెనుకే పరుగుతీస్తాడు. ఆమెకు నచ్చజెప్పాలని చూసే లోపే ఆమె ఒక వాగుగా మారిపోతుంది. అది చూసి, గుండె బండబారిపోయిన ఆమె భర్త ఒక కొండ గుట్టగా మారిపోతాడు. అతడిని తన అలల చేతులతో చుట్టుకుని, కిన్నెరసాని ప్రవహిస్తూ ఉంటుంది. ఇలా ఇద్దరూ అడవిలోనే ఉండిపోతారు. ఇది విన్న విశ్వనాథ వారిలోని భావుకతే, పందొమ్మిదేళ్ళ పిన్న వయసులోనే ఆయనను 'కిన్నెరసాని పాటలు' అనే కావ్యం రచించేలా చేసింది.

కేవలం యాభై ఐదు పేజీలు గల ఈ మధురగేయ కావ్యం 'ఖండగతి' అనే మాత్రా ఛందస్సులో నడుస్తుంది. ఈ కిన్నెరసాని పాటల్లో ఎనిమిది భాగాలున్నాయి. అవి ఏమిటంటే,

1. కల్పన – కిన్నెర పుట్టుక
2. కిన్నెర నడకలు
3. కిన్నెర నృత్యము
4. కిన్నెర సంగీతము
5. కడలి పొంగు
6. కిన్నెర దుఃఖము
7. గోదావరీ సంగమము
8. కిన్నెర వైభవము

వీటి గురించి ఒక్కొక్కటిగా తెలుసుకుందాము.

## కల్పన - కిన్నెరపుట్టుక:

జానపదుల పుక్కిట కథే కల్పనగా ఈ కావ్యం మొదలవుతుంది. భర్తపై కోపంతో వెళ్తున్న కిన్నెర హఠాత్తుగా నదిగా మారిపోతుంది. ఏరుగా మారిన భార్యను చూసి దుఃఖంతో అతడు "ఓహో కిన్నెరసానీ!" అంటూ, పరిపరి విధాలుగా భార్యనుద్దేశించి మనసువిప్పి మాటాడుతూ అనేకవిధాలుగా వాపోతాడు.

**"ఇప్పుడె కదె నాకౌగిట కప్పితి నీ శోకమూర్తి !**
**అప్పుడె నిలువున నీరై ఎప్పుడు ప్రవహించితివే!"** అంటూ విలపిస్తాడు.

'ఓహో కిన్నెరసాని! ఇంత కోపాన్ని ఏ ఇల్లాలూ చూపలేదు కదా. ఇప్పుడే దుఃఖంతో ఉన్న నిన్ను నా కౌగిట్లో బంధించాను. అంతలోనే నిలువునా కరిగి నీరయ్యావా? మన పెళ్ళైన తొలినాళ్లలో రాళ్ళ పైన కాలు కూడా మోపలేని సుకుమారిగా ఉండేదానివి. ఇప్పుడు నదిగా మారి, ఆ బండరాళ్లను ఒరుసుకుంటూ ఎలా ప్రవహిస్తావు? మొదట్లోనే నీ కన్నులు చూసి నువ్వు స్త్రీ ఆకృతి దాల్చిన నదీమతల్లివని అనుకున్నాను. అదే నిజం చేసావా? నీ మేనిలోని వెన్నెల తళుకులు ఈ నది తరగల్లో కనిపిస్తున్నాయి, నెమలి లాంటి నీ వయ్యారపు నడకలు, నదిగా పారుతున్న నీ గమనంలో చూస్తున్నాను. నీ నవ్వులు నురుగులుగా, ఈ నదిలో ఎగిరే మీనాలు నీ కన్నులుగా అనిపిస్తున్నాయి. పరుగెత్తి వెళ్తున్న నీ జడను పట్టుకోవాలని చూసాను, కాని, నా చేతిలో నీటి పొరలే మిగిలాయి. నీలాగా నేనూ నదినైపోతే బాగుండును. కాని, నీ కోసం ఏడ్చీ ఏడ్చీ నా గొంతు మూగబోతోంది, నా మేను బండబారిపోతోంది. నేను రాయిగా మారిపోతున్నాను...' అంటూ వాపోతాడు.

**'ఈ యేడుపు రొదలోపల / నా యొడలె నే నెఱుగను / నా యీ దేహ మిదేమో / ఱాయివోలె నగుచున్నది ఓహో'** అనే పద్యంతో ఈ భాగం ముగుస్తుంది.

కవిసామ్రాట్ మనసు దోచిన మన కిన్నెరసాని మామూలు స్త్రీ కాదు. నడకలు, నాట్యం, సంగీతం అన్నీ తెలిసిన నెరజాణ. వీటన్నింటినీ కిన్నెర నడకలు, నాట్యం, సంగీతం అన్న 2,3,4 అంకాలలో వర్ణించారు విశ్వనాథ వారు. రాయిగా మారిన భర్తను చూసి ఆమె వేదనతో వెనక్కు వస్తుంది. దిక్కుతోచక అతడి చుట్టూ తిరుగుతూ అక్కడే ఉండిపోదామనుకుంటుంది. కాని ఆమె ప్రవాహినిగా మారిపోయింది. కనుక ఒకచోట నిలవలేక పోయింది. తానూ రాయిగా మారిపోతే బాగుండునని భావిస్తుంది. 'ఓ నాథా ! పోనీ నువ్వూ నదిగా మారవచ్చు కదా, మనిద్దరం కలిసి ప్రవహిద్దాము' అని వేడుకుంటుంది. జలదేవతలు వచ్చి ఆమెను అక్కడనుంచి కదలమని తొందర పెడతారు. వదలలేక, ఉండలేక మధన పడుతున్న కిన్నెరసాని, కనుచూపుమేర వరకు భర్తను వెనక్కు తిరిగి చూస్తూ, భారంగా ముందుగు అడుగులు వేస్తుంది. ఇక్కడ

కిన్నెరసాని నడకను ఒక సాధారణ స్త్రీ వైఖరితో పోల్చి వర్ణించారు విశ్వనాథ వారు.

**"పతివంక చూచుచూ పడతి కిన్నెరసాని /పారేటి వేళలో భూమి తనంతతా /తోరమై విరియుచూ త్రోవగా చేసింది/**

**కెరటాలతో తాను చొచ్చుకోదు కిన్నెరసాని!"**

భూదేవి తొలగి ఆమెకు వెళ్ళవలసిన దారిని చూపిస్తోంది. అయినా కూడా, ఆమె ఆ సమయంలో కిన్నెరసాని తొడిమలేని పువ్వులా, మిక్కిలి సిగ్గుగల రాచకన్నెలా, కాంతిలేని రత్నంలా నడుస్తుంది.

**"నడిచింది నిడదచింది/నడిచి కిన్నెరసాని/నడిచి యందాలు చందాలుగా నడిచింది/గడియలోపల పెద్దకాల్వగా కట్టింది/ అడవితోగుల రాణి యన్నట్లు తోచింది**

**ఏమి కిన్నెరసాని/ఏమి కిన్నెరతోగు/బంగారుతీగలో పానకమ్మైపోయె/ కొబ్బరిపాలు వాకలు కట్టినట్లయ్యె/వెయ్యావులొకసారి పిదికినట్లైపోయె"** అంటూ బంగారు తీగలో పానకంలా, కొబ్బరిపాల ధారలా, వెయ్యావులను ఒక్కసారి పిదికినట్లు ధారగా కదిలిందంటూ అద్భుతమైన వర్ణనలు చేసారు.

వయ్యారి నడలతో వస్తున్న కిన్నరసానిని చూసి వనదేవతలు పుష్పవృష్టి కురిపించారు, వాయు దేవతలు స్వాగతించారు. భూదేవతలు ఎదురెళ్ళి దీవించారు. ప్రకృతి సంతోషించింది. కోయిలలు పాటలు పాడేయి, పికిలిపిట్టలు మేలిరకపు కూతలు కూశాయి. ఇక తెలుగుపిట్టల సంగతి సరే సరి! అవి ఒళ్ళు మరచి పోయి గానం చేశాయి! కిన్నెర రాకకు వనమంతా తన సంతోషాన్ని వ్యక్తం చేసిందిట! ఇంత వైభోగం తన వెంటనున్నాగాని కిన్నెరకు మాత్రం సంతోషం లేదు. ఆమె తన భర్తను తలుచుకుని బాధపడుతోంది. వెనక్కి తిరిగితిరిగి చూసుకుంటూ, జలదేవతలు ఎంతగానో బలవంతపెట్టడంతో తప్పనిసరిగా ముందుకు నడుస్తోంది.

కాలం ఎంతటి గాయాన్నైనా మాన్పుతుందని అంటారు. అలా మొదట్లో వేదనతో సాగినా, నెమ్మదిగా కిన్నెర స్వేచ్ఛగా పారసాగింది. ఆమె పరవళ్ళలో నాట్యం కనిపించింది, ఉరవడిలో సంగీతం వినిపించాయి. ఈ కావ్యంలో కిన్నెర సంగీతం, నాట్యం పదాలలో ప్రతిఫలించేలా అద్భుతమైన పదప్రయోగం చేసారు విశ్వనాథ వారు. ఈ వాక్యాలు పరిశీలించండి,

**"ధణధంగిణాం దధోం/ గిణ తక్కిణాం మద్దె/ లల మ్రోతలై కిన్నె/ రటు మ్రోగి యిటు మ్రోగి/ చిఱు లొల్లుసోనలై సిరులొల్కు సోనలై/ మృదు తాండవము చేసెనే వనవీథి/పదువు పాయలు కట్టెనే"** అంటూ పదాలతో ఆమెను నాట్యం చేయించారు విశ్వనాథ వారు.

అలాగే కిన్నెర సంగీత వర్ణనలో,

**"ఒకసారి సన్నగా ఒకసారి విన్నగా/ఉవిద కిన్నెరపాట యొయ్యారములు చూచి/ కళ్ళలో లేపచ్చ/ మళ్ళలో పసిలేళ్ళు**

**బెదురు చూపులు చూచెనో మైనిగల్/ నదరుగా కనుపించెనో**

**అం?కన్నియయెల్గు అడవి సాగినయట్లు/అతివ కిన్నెరపాట అతిసన్నగిలి పోవ/పొరలలో సనసన్న/తెరలలో చిఱుగాలి/యాపాట సాగించెనో ఉయ్యాల/ తో పాటు వూగించెనో"** అంటూ కిన్నెర పాటతో జగతి మైమరచిపోవడాన్ని మన కళ్ళకు కట్టినట్లు చూపుతారు.

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఆనందంగా ఆడుతూ, పాడుతూ సాగుతున్న కిన్నెర సోయగాల సంగతి ఆనోటా, ఈనోటా కడలి రాజుకు చేరింది. ఏ నీరైనా సరే, తనలో కలవకపోదుగా అన్న ధీమాతో అతడు కిన్నెరసానికై ఎదురు చూడసాగాడు. తన వయసును, స్థాయిని మర్చిపోయి, ఆమెకోసం ఉవ్విళ్ళూరసాగాడు. ఇదంతా 'కడలి పొంగు' అన్న ఐదవ అంకంలో, ఆ సమయంలోని సాగరుని పరిస్థితిగా, ఇలా వర్ణించారు కవిసామ్రాట్ ...

**"మిసమిసని మింటికై పొంగెను,**

**మసక మసకల కళ్ళు విప్పెనూ,**

**ఎంత దూరానుండొ ఈ చిన్ని పడుచంటు**

**సంతోషమే మేను సకలమ్ముగా మారి**

**ఉర్రుట్టలూగెనూ, మిరిమిర్రి చూచెను."**

వయసెంత పెరిగినా పురుషుడి సహజ ప్రవృత్తి స్త్రీని విలాస వస్తువుగా చూడడం. కాని స్త్రీ తన దేహాన్ని మాత్రమే చూసి తహతహ లాడిపోయే పురుష డిని అసహ్యించుకుంటుంది. అతడినే కాదు, అతడినలా అర్రులు చాచేలా చేసిన తన దేహాన్ని కూడా నిందించుకుంటుంది. కిన్నెరా అలాగే అనుకుంది. ఆమె దుఃఖాన్ని 'కిన్నెర దుఃఖం' అన్న అంకంలో వర్ణించారు కవిసామ్రాట్.

కిన్నెర క్షణికావేశంలో కట్టుబాట్లు దాటి ఏరుగా ప్రవహించిన తన తొందరపాటును నిందించుకుంది. గడప దాటిన స్త్రీ ప్రతి పురుషుడికి లోకువే కదా, అనుకుంది. కిన్నెర యెదలోని దుఃఖం అంతకంతకూ పెరిగి, భర్తను తలుచుకుని ఆమె పరిపరి విధాలుగా దుఃఖించింది...

**"ఓ నాథ! నిను వీడి వచ్చీ, ఓ రాజ! నిను వీడి వచ్చీ**

**నా యొదలు సైతమ్ము నానా జనులు కోర**

**ఈ ఏవపుం బ్రతుకు ఏల పొందితినిరా"** – అనుకొంటూ తనని తానె ఏవగించుకుంది కిన్నెర. ఆమె ఆనందాన్ని పంచుకున్న ప్రకృతి, జీవజంతువులు – ఆమె దుఃఖాన్ని కూడా పంచుకున్నాయి.

సన్నని ఎలుగుతో కిన్నెర ఏడ్చిన ఏడ్పులు విని ఆ అడవిలోని జీవులన్నీ ఆమెను ఓదార్చడానికని తరలి వచ్చాయి! ఆమె ఏడుపు చూసి సానుభూతితో చెట్టు కొమ్మలనున్న పక్షులు ఏడ్చాయి! వాగునీరు తాగడానికై వచ్చిన పులులు దిగులుపడ్డాయి. అడవిలోని మృగాలన్నీ కూడా కిన్నెర ఏడవడం చూసి తామూ ఏడ్చాయిట! ఎక్కడెక్కడి మృగాలు, పక్షులూ వచ్చి ఆమెను ఓదార్చబోయి, అంత వంతను ఎలా తీర్చాలో తెలియక ఆమెతోపాటుగా అవికూడా ఏడ్చాయిట! నీటి పులుగులూ, నేలపులుగులూ గుమిగూడి ఒకే ఇదిగా అవీ ఏడ్చాయన్నారు కవి. అడవి పక్షులు గూటిలోని పిల్లల్ని కూడా వదిలి, మేతకి పోవడం మరచి కిన్నెర దుఃఖంలో పాలు పంచుకోడానికి వచ్చాయిట!

ఇలా ఆ అడవి అంతా కిన్నెరతోపాటు తనుకూడా శోకించిందని రాశారు విశ్వనాథ! అంతేకాదు, ఈ అంకాన్ని ఎక్కడైనా చదువుతున్నప్పుడు తాను కూడా కన్నీరు కార్చేవారట కవిసామ్రాట్. ఇలా కిన్నెర దుఃఖాన్ని తెలుగింటి దుఃఖంగా ఆయన మార్చేసారు.

కిన్నెర శోకం, గోదావరిని చేరింది. కష్టంలో ఉన్న బిడ్డను చేతులు చాచి, హత్తుకుని ఓదార్చే తల్లిలా, గోదావరి కిన్నెరను ఓదార్చింది. తనలో కలుపుకుంటాను రారమ్మంది. కిన్నెర పరుగున వచ్చి, గోదావరిని చేరి ఆమెతో సంగమించింది. ఈ కథనంతా 'గోదావరీ సంగమం' అన్న అంకంలో వర్ణించారు విశ్వనాథ వారు.

అమ్మ ఒడిని చేరినా, తన అస్తిత్వాన్ని కోల్పోయినా, కిన్నెర బాధపడలేదు. పైగా తిరిగి వైభవంగా పొరింది. ఒక్కొక్క ఋతువులో ఒక్కొక్క అందాలను సంతరించుకుని, మెరిసిపోయింది. కిన్నెర వైభవం అనే చివరి అంకంలో పూర్వ కవుల ఋతువర్ణనా పద్ధతిలో వివిధ ఋతువులను మనోజ్ఞంగా వర్ణించారు విశ్వనాథ వారు.

**ఋతువు ఋతువున మారు రుచులలో కిన్నెరా**

**కారుకారువ మారు కాంతిలో కిన్నెరా**

**తెలుగు సత్కవిరాజు పలుకందుకోలేని**

**ఛవులూరి చవులూరి జలమెల్ల ప్రొవులై**

**కదిలేను కిన్నెరా**

**సాగేను కిన్నెరా**

**తెలుగు దైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న**

**రామయ్య అతని దర్శనము చేసే త్రోవ**

**కాచింది కిన్నెరా"**

చివరికిలా నానా ఇక్కట్లూ పడ్డ కిన్నెర, భద్రాద్రి రామయ్య దర్శనం చేసుకుని, ఆయన భక్తుల పాదాలు కడుగుతూ, వారికి చల్లని నీటిని అందిస్తూ సేద తీరింది. కిన్నెర పుట్టుక నుంచి, భద్రాద్రి గమనం వరకూ నిశితంగా గమనిస్తే, ఒక ఆధ్యాత్మిక సందేశం కూడా ఇందులో ఇమిడి ఉందని నిశ్చయంగా తెలుస్తుంది. ఏ జీవి అంతిమ గమ్యమైనా చివరికి ఆ పరమాత్మ సన్నిధి చేరి తరించడమే. ఎంతటి అందాలు, కళలు, ప్రతిభ, సంపదలు కలగలసిన వారైనా సరే, అవన్నీ దైవదత్తమే కనుక, చివరికి వారు ఊరట పొందేది దైవం ఒడిలోనే. అంతర్లీనంగా ఈ సందేశాన్ని అందిస్తూ, కిన్నెరసాని పాటలను ముగిస్తారు కవిసామ్రాట్.

ప్రేమ, వేదన, ఆనందం, దుఃఖం, హృద్యమైన ప్రకృతి వర్ణనలు వంటి సమ్మిళితమైన భావనలతో ఉండే ఈ కావ్యం, పెద్దల రచనలను పరిశీలించి నేర్చుకోవాలనే తపన ఉన్న నేటి కవులకు మార్గదీపికగా నిలుస్తుంది. ●



# చండీశ్వరుడు

ఒకానొకప్పుడు చిదంబర క్షేత్రంలో 'యచ్చదత్తనుడు' అనబడే బ్రాహ్మణుడు ఉండేవాడు.

ఆయనకు 'విచారశర్మ' అనబడే కొడుకు ఉన్నాడు. ఆ కొడుకు వేదం నేర్చుకున్నాడు. ఆయన వేదమును చక్కగా సుస్వరంతో చదివేవాడు. ఎప్పుడూ స్వరంతప్పేవాడు కాదు. గోవులు దేవతలని నమ్మిన పిల్లవాడు.

ఒకరోజు ఆవులను కాసే ఒక ఆయన ఆవును కొడుతూ తీసుకువస్తున్నాడు. అది చూసిన ఆ పిల్లవాడి మనసు బాధపడి 'నేనే రేపటి నుండి ఈ ఆవులను కాస్తాను. నీవు ఈ ఆవులను కొట్టవద్దు. తీసుకుని వెళ్ళవద్దు' అని చెప్పాడు.

బ్రాహ్మణుడు బ్రహ్మచారి వేదం చదువుకున్నవాడు ఆవులను కాపాడితే మంచిదే కదా అని ఊళ్ళో ఉన్న వాళ్ళందరూ ఆవుల వెనకాల ఈ పిల్లవాడిని పంపించారు. ఈ పిల్లవాడు వేదమంత్రములను చదువుకుంటూ వాటిని స్పృశించి వాటిని జాగ్రత్తగా కాపాడుతుండేవాడు. వేదంలో కొన్ని కొన్ని పన్నాలకు కొన్ని కొన్ని శక్తులు ఉంటాయి. ఆవుల్ని రక్షించడానికి ఆ పన్నాలను చదువుతూ వాటిని కాపాడేవాడు. ఆవులు సంతోషించి ఆ పిల్లవాడు కూర్చున్న చోటికి వచ్చి అతడు మంచినీళ్ళు తాగడానికి ఒక కుండ తెచ్చుకుంటే ఆ కుండలో పాలు విడిచి పెట్టేస్తుండేవి. రోజూ ఇచ్చే పాలకన్నా ఎక్కువ పాలను ఇంటి దగ్గర ఇచ్చేవి. ఈ పిల్లవాడు ఆవులు ఎలాగూ పాలువిడిచి పెడుతున్నాయి కదా వట్టినే కూర్చోవడం ఎందుకని ఈ ఆవులు విడిచిపెట్టిన పాలతో శివాభిషేకము చేయదలచాడు.

రుద్రం చదవడం కన్నా గొప్పది మరొకటి లేదు. అందుకే లోకమునందు సన్యసించినవారు కూడా రుద్రాధ్యాయం చదవాలని నియమం. రుద్రాధ్యాయం అంత గొప్పది. అది చదివితే పాపములు పటాపంచలు అయిపోతాయి. అటువంటి రుద్రం చదువుతూ ఇసుకతో శివలింగం కట్టి ఈ పాలను తీసి రుద్రాధ్యాయంతో అభిషేకం చేస్తూ ఉండేవాడు. ఒకరోజున అటునుంచి ఒక వెర్రివాడు వెళ్ళిపోతున్నాడు. 'అయ్యో, ఈ పిల్లవాడు ఈ పాలనన్నిటిని ఇసుకలో పోసేస్తున్నాడు. ఇంకా ఆవులు ఎన్ని పాలిచ్చునో అని వెళ్ళి ఆ పిల్లవాడి తండ్రికి చెప్పాడు. చెప్తే యచ్చదత్తనుడికి కోపం వచ్చింది. 'రేపు నేను చూస్తాను' అని చెప్పి మరుసటి రోజున కొడుకు కన్నా ముందే బయలుదేరి అడవిలోకి వచ్చి ఆవులు మేసేచోట చెట్టెక్కి కూర్చున్నాడు.

పూర్వకాలం క్రూర మృగములు ఎక్కువ. అందుకని కఱ్ఱ గొడ్డలికూడా తనతో తెచ్చుకుని చెట్టెక్కి కూర్చున్నాడు. కాసేపయింది. కొడుకు ఆవులను తీసుకువచ్చి అక్కడ ఆవులను విడిచిపెట్టాడు. ఆవులు అక్కడ మేత మేస్తున్నాయి. ఈయన సైకత లింగమును తయారు చేసి సైకత ప్రాకారములతో శివాలయ నిర్మాణం చేశాడు. తరువాత చక్కగా ఈ ఆవులు తమంత తాముగా విడిచిపెట్టిన పాలతో రుద్రం చదువుతూ అభిషేకం చేసుకుంటున్నాడు. ఆయన మనస్సు ఈశ్వరుని యందు లయం అయిపోయింది. అతను పరవశించిపోతూ సైకత లింగమునకు అభిషేకం చేస్తున్నాడు. అవును అతడు చెప్పింది నిజమే.

వీడు ఇసుకలో పాలు పోస్తున్నాడని దూరంగా చెట్టు మీద ఉన్న తండ్రి చెట్టు దిగి పరుగెత్తుకుంటూ వచ్చి పెద్ద పెద్ద కేకలు వేసి పిల్లాడిని భుజముల మీద కొట్టాడు. ఆ పిల్లవాడికి బాహ్యస్మృతి లేదు. అతను అభిషేకం చేస్తూనే ఉన్నాడు. కోపం వచ్చిన తండ్రి తన కాలితో అక్కడి సైకత లింగమును తన్నాడు. అది ఛిన్నాభిన్నమయింది. అప్పుడు ఆ పిల్లవాడికి బాహ్యస్మృతి వచ్చింది.

తండ్రి వచ్చినప్పుడు గొడ్డలి అక్కడ పెట్టాడు. ఈ పిల్లవాడు వచ్చినవాడు తండ్రియా లేక మరొకడా అని చూడలేదు. ఏ పాదము శివలింగమును తన్నిందో ఆ పాదము ఉండడానికి వీలులేదని గొడ్డలి తీసి రెండు కాళ్ళు నరుక్కుపోయేటట్లు విసిరాడు. తండ్రి రెండు కాళ్ళు తొడలవరకు తెగిపోయాయి. క్రిందపడిపోయాడు. నెత్తుటి ధారలు కారిపోతున్నాయి.

కొడుకు చూశాడు.

'శివలింగమును తన్నినందుకు నీవీ ఫలితం అనుభవించవలసిందే' అన్నాడు. నెత్తురు కారి తండ్రి మరణించాడు.

ఆశ్చర్యంగా అక్కడ ఛిన్నా భిన్నమయిన సైకత లింగం లోంచి పార్వతీ పరమేశ్వరులు ఆవిర్భవించారు.

నాయనా, ఇంత భక్తితో మమ్మల్ని ఆరాధించావు. అపచారం జరిగిందని తండ్రి అనికూడా చూడకుండా కాళ్ళు రెండూ నరికేశావు. మనుష్యుడవైపుట్టి తపస్సు చేయకపోయినా వరం అడగకపోయినా నీకు వరం ఇస్తున్నాను. ఇవాల్టి నుండి నీవు మా కుటుంబంలో అయిదవ వాడవు. నేను, పార్వతి, గణపతి, సుబ్రహ్మణ్యుడు. అయిదవ స్థానం చండీశ్వరుడిదే. నిన్ను చండీశ్వరుడు అని

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై



పిలుస్తారు. ఇకనుంచి లోకంలో వివాహం అయితే భర్త భోజనం చేసి విడిచి పెట్టిన దానిని పత్నీ భాగం అని పిలుస్తారు. భార్యకు దానిని తినే అధికారం ఉంటుంది. దానిని ఎవరు బడితే వారు తినెయ్యకూడదు. భార్య కొక్కదానికే ఆ అధికారం ఉంటుంది. అది పత్నీభాగం.

కానీ శంకరుడు ఎంత అనుగ్రహం చేశాడో చూడండి.

పార్వతీ నేను ఈవేళ చండీశ్వరుడికి ఒక వరం ఇచ్చేస్తున్నాను. నీవు అంతఃపురంలో నాకు భోజనం పెడతావు కదా. నేను తిని విడిచిపెట్టిన దానిని చండీశ్వరుడు తింటూంటాడు. వేరొకరు తినరాదు' అన్నాడు. ఆ చండీశ్వరుడు ఎప్పుడూ శంకరుని ధ్యానం చేస్తూ ఉత్తరముఖంలో కూర్చుని ఉంటాడు. చండీశ్వరుడు బహిర్ముఖుడై ఉండడు. ఎప్పుడూ కళ్ళు మూసుకుని ఉంటాడు. ఎప్పుడూ శివ ధ్యాన తత్పరుడై ఉంటాడు. ఆయనను పిలిస్తే ఆయనకు కోపం వస్తుంది. అందుకని ఆయనకు 'ధ్వనిశ్చండుడు' అని పేరు. మనలో చాలామంది తెలిసీ తెలియక శివాలయంలో కొట్టిన కొబ్బరి కాయ ఇంటికి తీసుకు వెళ్ళకూడదని గోడల మీదపెట్టి వెళ్లిపోతుంటారు. ప్రసాద తిరస్కారం మహాదోషం. అలా వదిలి పెట్టి వెళ్ళకూడదు. శాస్త్ర ప్రకారం ఆయన దగ్గరకు వెళ్ళినపుడు చిన్న చిటిక మాత్రం వెయ్యాలి. అందుకే ఆయనకి చిటికల చండీశ్వరుడు అని పేరు. చిటిక వేస్తే ధ్యానమునందు ఉన్నవాడు కళ్ళు విప్పి కోపంగా చూస్తాడు.

ఓహో మా స్వామిని ఆరాధించావా? ప్రసాదం తీసుకున్నావా? సరి అయితే తీసుకు వెళ్ళు' అంటాడు. ఆయనకు చూపించిన తర్వాత ఆ ప్రసాదం మీద మీకు పూర్ణాధికారం ఉంటుంది. దానిని మీరు ఇంటికి తీసుకు వెళ్ళవచ్చు. లోపల శివుడికి ఒక ముక్క ఉండిపోయింది. అది చండీశ్వరునికి వెళ్ళి పోతుంది. మీకు ఇచ్చినది ప్రసాద రూపము. దానిని మీరు గుడియందు విడిచి పెట్టి వెళ్ళిపోతే మీ కోరిక తీరదు. అందుకని శివాలయంలో ఇచ్చిన కొబ్బరి చెక్కలు గాని, ప్రసాదం కానీ అక్కడ వదిలి పెట్టేయ్యకూడదు. నంది మీద పెట్టడం కాదు. చండీశ్వర స్థానమునందు తప్పట్లు కొట్టకూడదు. చిటిక చిన్నగా మాత్రమే వేయాలి. అంత పరమ పావనమయిన స్థితికి చేరిన వాడు చండీశ్వరుడు.

ద్రవిడ దేశంలో శివాలయంలో ఊరేగింపు జరిగితే నందిని తీసుకు వెళ్ళరు. చండీశ్వరుడు ఉంటాడు ఉత్సవ మూర్తులలో. పార్వతీ పరమేశ్వరులు, గణపతి, సుబ్రహ్మణ్యుడు, చండీశ్వరుడు ఈ అయిదింటిని ఊరేగింపుగా తీసుకువెడతారు. పరమేశ్వరుడు చండీశ్వరునికి అయిదవ స్థానం ఇచ్చారు. ఒక్కసారి శివాలయంలోకి మనం గడపదాటి అడుగుపెడితే అటువంటి మూర్తులను దర్శనం చేసి శివలింగ దర్శనం చేసి అమ్మవారిని చూస్తాము. మన భాగ్యమే భాగ్యం.

అందుకే శివాలయం విష్ణ్వాలయం ఈ రెండూ లేని ఊరు పూర్వం ఉండేది కాదు. ఈ రెండూ ఉండి తీరాలి.

**ఓమ్ నమ శివాయ**




## ప్రముఖాంధ్ర గురించి



**మీ,** మా, మనందరి మాసపత్రిక ప్రముఖాంధ్ర. అన్ని వయసుల వారిని అలరింపచేసేది. విద్యావైద్యము, రాజకీయము, ఆధ్యాత్మిక విశేషములు, సామాజిక విషయములు, భక్తి విశేషములు, కవులును, గాయకులను మరి ఎందరో మహానుభావులను పరిచయం చేస్తూ వున్న ప్రముఖాంధ్ర పత్రిక.

నిత్యము తన యవ్వనముతో పుణికిపుచ్చుకొని ప్రచురించుచున్న యిలాంటి పత్రిక ఎన్నో, మరెన్నో రజతోత్సవాలను జరుపుకోవాలని నిర్వాహకులకు ఆ భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యములను కలుగజేయాలని కోరుకుంటూ వున్నాను. రజతోత్సవ వేడుకలు అత్యంత ప్రతిష్ఠాకరంగా జరగాలని ఆశిస్తున్నాను.

మీ ప్రియ పాఠకుడు

**అమరా వెంకటరాఘవాచారి,** చీరాల

92474667884

## ఆత్మీయ అభినందనలు

ప్రముఖాంధ్ర 25 సంవత్సరములు పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా నా అభిమాన సందేశం.

యీ సందర్భంగా వ్యవస్థాపకునికి నివాళులర్పిస్తూ, వారిని స్మరించుదాం.
ఉదయించే ప్రతి వెలుగుకీ సూర్యుడే రారాజు.
ముగిసే ప్రతి రాత్రికీ ఆ చంద్రుడే రాజు.
మనసులో కుసుమాలను వికసింపచేసేటి వసంతానికి ఆ కోయిలే రారాజు.
తొలకరిలో తేనె ఆశలు చిగురింపచేసే ఆషాఢానికి కురిసే మేఘమే రారాజు.
అనంతమయిన, అసాధ్యమయిన యీ పత్రిక ప్రచురణకు
మీరే రారాజులు, మహారాజులు, కలం మాటున వచ్చిన
మాట కాదు ఇది, జనం మదిలో దాగిన నిత్య సత్యం.

మీ పత్రిక ప్రజలచే ప్రశంసల జల్లు కురిపించుకుంటూ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తూ, స్వర్ణవర్ణ, మేలిమి కలయికగా వుంటూ, నిత్యనూతన కాంతులతో ఉజ్వల భవిష్యత్ కలగాలని ఆశిస్తూ, అభినందిస్తూ యీ శుభ సమయములో యివే నా అభిమాన శుభాకాంక్షలు.

ఇట్లు

మీ **అమరా వెంకట రాఘవరావ్,** చీరాల

## భాగవతాదారితం

ఈ చమత్కార పద్యంలో ఎంతమంది మామలో!

**మామను సంహరించి, యొక మామకు గర్వమడంచి, యన్నిశా**
**మామను రాజు చేసి, ఒక మామ తనూజున కాత్మబంధువై**
**మామకు గన్నులిచ్చి, సుతు మన్మథునింతికి దానె మామయై**
**మామకు మామయైన పరమాత్ముడు మీకు ప్రసన్నుడయ్యెడున్!**

ఈ విష్ణు ప్రార్థనా పద్యంలో ఎంత చక్కని చమత్కృతిని ప్రదర్శించాడు కవి!

మేనమామయగు కంసుణ్ణి చంపినవాడు,

తన భార్య లక్ష్మికి తండ్రి కనుక మామ అయిన సముద్రుడి గర్వాన్ని రామావతారంలో తొలగించినవాడు,

రాత్రిపూట వెలిగే చందమామను రాజుగా చేసి,

మేనత్త భర్త పాండురాజు కుమారుడైన అర్జునునికి ఆత్మీయుడు,

మామ ధృతరాష్ట్రునికి విశ్వరూప సందర్శనానికి చూపునిచ్చినవాడు,

మన్మథుని భార్య రతీదేవికి తానే మామ అయినవాడు,

తన మామ సముద్రునికి తన కూతురైన గంగను భార్యగా చేసినందుకు మామకు మామ అయినవాడు అగు పరమాత్ముడు నారాయణుడు మీకు ప్రసన్నుడవుగాక అని భావము.



# ఐశ్వర్యానికి కారకుడు శివుడు??

ఈశ్వరానుగ్రహంతో ఐశ్వరం పొందిన కుబేరుడికి ఒకసారి తానే ధనవంతుడిననే అహకారం కలిగింది. అందువల్ల దేవతలందరికి మంచి విందు భోజనం ఏర్పాటు చేసి తన గొప్పతనాన్ని చాటుకోవాలని తలచాడు కుబేరుడు. దేవతలందరిని ఆహ్వానించి, శివపార్వతులను ఆహ్వానించడానికి కైలాసానికి వెళ్తాడు.

శివుడు కొండల్లో ఉంటాడు, ఒక ఇల్లు కూడా ఉండదు, నా ఇంటిని చూసి శివుడు ఆశ్చర్యపోతాడు, ఎంత బాగుందో అంటూ పొగుడుతాడు, అప్పుడు దేవతల్లో నా కీర్తి పెరుగుతుందనే ఆలోచనలతో కైలాసంకు చేరుకుంటాడు.

శివుడు సర్వాంతర్యామి, ఎవరెవరు ఎప్పుడెప్పుడు ఏమంకుంటున్నారో అన్ని తెలుసుకోగలడు. కుబేరుడు అహాన్ని పసిగట్టాడు. పార్వతీదేవి కూడా కుబేరుడి పథకాన్ని అర్దం చేసుకుంది. కుబేరుడు వచ్చేసరికి శివపార్వతులు మాట్లాడుకుంటున్నట్టు నటించారు.

కుబేరుడు వచ్చి.. మహాదేవా.. మీరు, పార్వతీదేవి కలిసి మా ఇంట్లో నిర్వహించే విందు భోజనానికి తప్పక రావాలి అన్నాడు.

శివుడు తనకు కుదరదన్నాడు, భర్త రాకుండా తానుకూడా రానన్నది పార్వతీ దేవి. ఇంతలో వినాయకుడు కైలాసానికి వచ్చాడు.

వస్తూనే... 'అమ్మా! ఆకాలేస్తోంది, ఏదైనా ఉంటే పెట్టు' అన్నాడు గణపతి.

పార్వతీదేవి గణపతి వైపు కనుసైగ చేసి..

'కుబేరా! మా గణపతి మీ ఇంటికి విందుకు వస్తాడు' అనగా, శివుడు 'ఔనౌను, గణపతికి విందు భోజనం అంటే మహాఇష్టం. మా బదులుగా గణపతిని తీసుకెళ్ళు' అన్నాడు పరమశివుడు.

హా! ఈ ఏనుగు ముఖమున్న పసిపిల్లవాడా, నా ఇంటికి విందుకోచ్చేది.

ఎంత తింటాడులే అనుకుంటూ గణపతిని తీసుకుని బయలుదేరాడు. తన భవనంలోకి తీసుకెళ్ళి, తన భవనంలో ఉన్న సౌకర్యాలను, ఇతర సంపదలను చూపించసాగాడు.

ఇవన్నీ వ్యర్థం, త్వరగా ఆహారం పెట్టండి అని గణపతి అనగా, కుబేరుడు భోజనం సిద్ధం చేయవలసిందిగా అక్కడున్న పనివారికి ఆజ్ఞ చేశాడు.

వెంటనే బంగారు కంచం పెట్టి, రకరకాల తీపి పదార్థాలు, పానీయాలు, కూరలు, పండ్లు.. గణపతికి వడ్డించారు.

కుబేరుడు చూస్తుండగానే ఒక్కపెట్టున గణపతి కంచంలో ఉన్న ఆహారాన్ని, అక్కడ పాత్రల్లో పెట్టిన ఆహారాన్ని తినేసి, ఇంకా తీసుకురండి అంటూ ఆజ్ఞ చేశాడు.

సేవకులు వంటశాలలో ఉన్న ఆహారం మొత్తాన్ని తీసుకువచ్చి గణపతికి వడ్డించారు. అయినా గణపతి ఆకలి ఇసుమంతైనా తగ్గలేదు, కడుపు నిండలేదు.

ఇంకా కావాలి అంటూ గణపతి అడిగాడు. వంటవారికి ఆహారం వండటం గణపతికి వడ్డించడమే పనైపోయింది. కాసేపటికి కుబేరుడి వంటశాల మొత్తం చూస్తూండగానే ఖాళీ అయిపోయింది.

విషయం కుబేరుని తెలిసింది. తన సంపద మొత్తం తరిగిపోతోంది కానీ, గణపతి కడుపు నిండడంలేదు, ఏమి చేయాలో అర్థంకాలేదు. ఇంతలో గణపతి ఆగ్రహంతో ఊగిపోతూ కుబేరుని పిలిచి, నీ ఇంటికి విందుకు రమ్మని, నాకు ఆహారం పెట్టకుండా అవమానిస్తున్నావ్ అంటూ పలికాడు.

కుబేరుడికి విషయం అర్థమైంది. తనకున్న సంపద ఆ పరమాత్ముడిని ఏ మాత్రం సంతృప్తి పరచలేదని, అన్ని ఇచ్చిన భగవంతుడి దగ్గరే దర్పాన్ని చూపాలనుకోవడం మూర్ఖత్వమని, తన అహకారం అణచడానికే దైవం ఈ విధంగా చేశాడని గ్రహించి పరుగుపరుగున కైలాసానికి వెళ్ళాడు.

శివా.. శంకరా.. నేవే దిక్కు.. ధానం కి నన్ను నీవే అధిపతిని చేశావని మరిచి అహంకారంతో ప్రవర్తించాను. అందుకు ప్రతిగా గణపతి నా సంపద మొత్తాన్నీ ఖాళీ చేసి, అన్ని ఇచ్చిన భగవంతుడే, అహంకరించినవారి సర్వసంపదలు తీసివేస్తాడని నిరూపించాడు. మీ బిడ్డడైన గణపతి ఆకలి తీర్చలేకపోతున్నాను. ఏదైనా మార్గం చూపించండి అన్నాడు.

అప్పుడు శివుడు "కుబేరా! నీవు ఇంతసేపు అహంకారంతో గణపతికి భోజనం పెట్టావు. అందుకే గణపతి సంతృప్తి చెందలేదు. గణపతికి కావల్సినది భక్తి మాత్రమే. నీకు ఎంత ఉందన్నది అతనికి అనవసరం, నీవు ఎంత భక్తితో సమర్పించావన్నది మత్రామే గణపతి చూస్తాడు. ఇదిగో ఈ గుప్పేడు బియ్యం తీసుకుని అహకారం విడిచి, చేసిన తప్పుని ఒప్పుకుని పరమభక్తితో గణపతికి సమర్పించు" అన్నాడు.

కుబేరుడు ఆ గుప్పెడు బియ్యాన్ని ఉడికించి, గణపతికి భక్తితో సమర్పించాడు.

ఆ గుప్పెడు బియ్యం తినగానే గణపతికి కడుపు నిండి, త్రేనుపులు వచ్చాయి. గణపతి సంతృప్తి చెందాడు.

మనం దేవుడికి ఎంత సమర్పించామన్నది కాదు, ఎంత భక్తితో ఇచ్చామన్నది ముఖ్యం.

కుబేరుడి అహంకారాన్ని అణిచివేసిన గణపతి, మనలోని అహంకారాన్ని కుడా పటాపంచలు చేయుగాకా.

**నీతి : పెట్టేది కొంచెమైనా అహంతో కాకుండా ప్రేమతో భక్తితో పెట్టడం వల్ల అంతా మంచి జరుగుతుంది.**

**సర్వేజనా సునోభవంతు..**

**ఓం నమః శివాయ..**

**హర హర మహదేవ శంభో శంకరా...!!**



# ఆత్మబంధువు శ్రీ గోటేటి గారితో నా అనుబంధం





శ్రీ గోటేటి గార్ని వారి స్వగృహంలో కలుసుకున్న డి. భాస్కరరావు-కుటుంబ సభ్యులు


**నా** సుదీర్ఘ జీవనయాత్రలో తమ తమ అసాధారణ వ్యక్తిత్వ శైలులతో నాపై తీవ్రమైన ప్రభావం చూపించిన అతికొద్దిమంది వ్యక్తుల్లో, 'రామ' నామధేయం కల్గిన వ్యక్తులు ముందు వరుసలో నిలుస్తారు. ఇందులో మొట్టమొదటగా చెప్పుకోవలసిన వ్యక్తి - 'విశ్వవిఖ్యాత నటసార్వభౌమ' స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు. నాకు ఊహ తెలిసిన తొలి క్షణాల్లోనే ఆయనపై నాకు గాఢమైన అభిమాన ముద్ర పడింది. అనన్య సామాన్యమైన ఆయన నటనా కౌశల్యానికే నేను ఆకర్షితుడ్ని అవ్వలేదు. నటన పట్ల ఆయనకున్న అంకితభావం, కృషి-పట్టుదల, అకుంఠిత దీక్షాదక్షతులు, అపారమైన క్రమశిక్షణ - సమయపాలన నన్నెంతగానో ముగ్ధుడ్ని చేసి, ఆయన వీరాభిమానిగా మార్చేసాయి. అదేవిధంగా... చిన్నప్పట్నుండి నాకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు ఆధునిక సమాజపు అలవాట్లను నాకు నూరిపోస్తూ, నా బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయడమే కాకుండా, తన ఏకైక కుమార్తె (చి॥ విజయలక్ష్మి)ను నాకు కానుకగా ఇచ్చి (అర్ధాంగిని చేసి) నాతో "మామయ్యగారు" అని పిలిపించుకునే మహాభాగ్యాన్ని ప్రసాదించిన నా ప్రథమ గురువు - రిటైర్డు స్టేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్, శ్రీ యర్ర రామారావు గారు. ఇదే కోవకు చెందిన వ్యక్తుల్లో : మీడియా మొఘల్, ఈనాడు సంస్థల అధినేత - శ్రీ సి.హెచ్. రామోజీరావు గారు ఒకరైతే, మరో వ్యక్తియే మన ధ్రువతార 'విద్యావిశారద' స్వర్గీయ శ్రీ గోటేటి శ్రీరామారావు గారు. ఈ సందర్భముగా పూజ్యులు శ్రీ గోటేటి గారి గురించి నా స్వయానుభవాలను మీ ముందుంచదలచుకున్నాను.

నేను కాలేజీ (ఇంటర్) చదువుతున్న రోజుల్లోనే... నాకు తెలియకుండానే ఆయనతో ఏదో ఒక తీయని అనుబంధం ఏర్పడింది. చిన్నప్పట్నుంచీ నాకు పుస్తక పఠనంపై ఎంతో ఆసక్తి ఉండేది. అందులో సినిమా పుస్తకాలది ప్రత్యేక స్థానం. అవి కూడా ముఖ్యంగా నటీనటులకు సంబంధించి విశేషాలు, వారి అందచందాల కంటే, తెరవెనుక సినిమా నిర్మాణ రంగానికి సంబంధించే వార్తాంశాల్ని ఇష్టపడి చదివేవాడ్ని. ఈవిధంగా నేను ఇష్టపడి చదివే/చూసే సినిమా పుస్తకాల్లో 'విజయచిత్ర'తో పాటు శ్రీ గోటేటి గారి సంపాదకత్వంలో వెలువడిన "సినీరమ" ముఖ్యమైనవి. అప్పట్లోనే ఆయన తనదైన బాణీలో అందించే వివిధ శీర్షికల్ని తు.చ. తప్పకుండా చదవడమే కాకుండా తరచుగా వాటిపై నా అభిప్రాయాల్ని తెలియజేస్తూ ఉండేవాడ్ని. అటు కొంతకాలం తర్వాత 'సినీరమ' ప్రచురణ ఆగిపోవడంతో పాటు మామధ్య దూరం కూడా పెరగడం జరిగిపోయాయి.

కాలగమనంతోపాటు... ఉద్యోగరీత్యా నేను అండమాన్-నికోబార్ దీవుల్లో స్థిరపడ్డం జరిగింది. ఒకప్రక్క ఉద్యోగ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహిస్తూనే మరోప్రక్క - అన్యభాషా ప్రభావాలకు లోను కాకుండా ఈ అండమాన్-నికోబార్ దీవుల్లో కూడా మన తెలుగు భాషా సౌరభాలను గుభాళింపజేయాలనే ఉద్దేశ్యంతో 1995 సంవత్సరం నందు ఔత్సాహికులైన కొందరు స్థానిక తెలుగు మిత్రులతో కలసి "అమరావతి కళాస్రవంతి" అనే సాంస్కృతిక సంస్థను నెలకొల్పడంలో ముఖ్య భూమికను పోషించడం జరిగింది. అంతేకాకుండా ఆ సంస్థకు వ్యవస్థాపక కార్యదర్శిగా ఎనలేని సేవలందించి అతి తక్కువ కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన తెలుగు సాంస్కృతిక సంస్థగా తీర్చిదిద్దడం జరిగింది.

యధాప్రకారంగా ఒకరోజు నేను 'ఆంధ్రప్రభ' వారపత్రిక చూస్తుండగా... అనుకోకుండా అందులో శ్రీ గోటేటి రామారావు గారికిసంబంధించి ఒక వార్తాంశం నాకంటపడింది. ప్రపంచం నలుమూలల్లో ఉంటున్న తెలుగు ప్రముఖులకు, తెలుగు భాషాభిమానులకు సంబంధించిన విశేషాలతో పాటు తెలుగు భాషా సంస్కృతులను దీప్తినొందిస్తూ "ప్రముఖాంధ్ర" మాస పత్రికను వెలువరిస్తున్నట్లు చదివి తెల్సుకున్న నేను ఆయన కృషిని శ్లాఘిస్తూ... ప్రముఖాంధ్ర విజయాన్ని కాంక్షిస్తూ... వెంటనే ఆయన లేఖ ద్వారా నా అభినందనలు తెలియజేయడం జరిగింది. అప్పట్నుండీ తిరిగి మామధ్య ఆత్మీయానుబంధం చిగురించి, ఉత్తర ప్రత్యుత్తరాల పర్వంతో అనతికాలంలోనే మా బంధం శాఖోపశాఖలుగా విస్తరించింది.

భారతదేశంలో అంతర్భాగమైనప్పటికీ ముఖ్యభూమికి ఎంతో దూరంగా, సముద్రపు నడిబొడ్డు నుంటూ తెలుగు భాషావ్యాప్తికై మరియు తెలుగు భాషా పరిరక్షణకై మావంతు కృషిని అభినందిస్తూ... ప్రత్యేకించి విభిన్న కార్యక్రమాల నిర్వహణలో నేను తీసుకుంటున్న చొరవ, ప్రత్యేక శ్రద్ధ గురించి అయితేనేమి, నా దస్తూరి గురించి అయితేనేమి నాపై ప్రశంసల జల్లు కురిపిస్తూ 'ప్రముఖాంధ్ర'ద్వారా విశేష ప్రాచుర్యం కల్పిస్తూ, దేశ విదేశాల్లోని తెలుగు ప్రముఖులు నాగురించి తెల్సుకునే అవకాశం కల్గించడమే కాకుండా, మా సంస్థ సభ్యుల్లో పెల్లుబికే ఉత్సాహాన్ని ద్విగుణీకృతం గావించేవారు. అదేవిధంగా ప్రతీ యేడు "అమరావతి కళాస్రవంతి" వార్షికోత్సవం నాడు ఆవిష్కరించే అభినందన సంచికలకు క్రమం తప్పకుండా తన అమూల్య సందేశాల ద్వారా శుభాభినందనలు తెలియజేస్తూ మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించేవారు. ఎప్పటికప్పుడు ఆయనందిస్తున్న అపూర్వ ప్రోత్సాహకాలకు ముగ్ధుడై నేను శ్రీ గోటేటి శ్రీరామారావు గారిని ఎప్పటికైనా సరే అండమాన్-




**గోటేటి గ్రాఫిక్స్‌లో రూపుదిద్దుకున్న 'అండమాన్ ఆంధ్రావాణి' మరియు 'అమరావతి కళాస్రవంతి' అభినందన సంచికలు**

నికోబార్ దీవులకు రప్పించి, ఘనంగా సత్కరించాలనే కోరిక ప్రగాఢంగా ఉండేది కానీ మాసంస్థకున్న ఆర్థిక ఇబ్బందులవలన నా కల కలగానే మిగిలిపోతూ వచ్చింది.

అయితే వైవిధ్యభరితమైన కార్యక్రమాలతో విజయపథాన నడిపిస్తున్న 'అమరావతి కళాస్రవంతి' కార్యదర్శిగా నాసేవల్ని గుర్తిస్తూ... పోర్టుబ్లెయిర్‌లోని ప్రఖ్యాత తెలుగు సంఘం "ఆంధ్రా అసోసియేసన్" అధ్యక్షులు (శ్రీ పి. సూర్యారావు గారు) మరియు ప్రధాన కార్యదర్శి (శ్రీ వి. కేశవమూర్తి గారు) 2000 సంవత్సరం నుండీ నన్ను సంయుక్త కార్యదర్శిగా నియమించడం జరిగింది. దాంతో నా చిరకాల కోరిక నెరవేరే సదవకాశం రానే వచ్చింది. రాబోవు 'ఆంధ్రా అసోసియేషన్' యొక్క స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఒక ప్రత్యేక అభినందన సంచికను 'గోటేటి గ్రాఫిక్స్'లో అందంగా తెలుగులో ముద్రించడంతోపాటు, ఆ సంచికను శ్రీ గోటేటి గారి చేతులమీదుగానే ఆవిష్కరిస్తే బాగుంటుందని నా ప్రతిపాదనను ఆంధ్రా అసోసియేసన్ కార్యవర్గ సభ్యులకు గట్టిగా చెప్పి ఒప్పించడం జరిగింది. ఈవిధంగా నా కల సాకారమై శ్రీ గోటేటి గారి అండమాన్-నికోబార్ దీవుల పర్యటనకు మార్గం సుగమమయ్యింది. ఈ నేపథ్యంలో 13 మార్చి 2002 నాడు ఆంధ్రా అసోసియేషన్ నిర్వహించిన ఉగాది వేడుకలకు ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొని తన సువర్ణ హస్తాలతో 'అండమాన్ ఆంధ్రావాణి' ప్రత్యేక అభినందన సంచికను ఆవిష్కరించారు. ఈ ఉగాది వేడుకలకు పోర్టుబ్లెయిర్‌లోని పోర్టు మేనేజ్‌మెంట్ బోర్డు (పి.యం.బి.)కు చీఫ్ పోర్టు అడ్మినిస్ట్రేటర్‌గా అత్యున్నత బాధ్యతలు నిర్వహిస్తున్న తొలి తెలుగు వ్యక్తి శ్రీ ఎన్. ధిల్లేశ్వరరావు, ముఖ్య అతిథిగా పాల్గొని ఈ వేడుకలను ప్రారంభించడం మరో విశేషం. ఈ సందర్భముగా... అతి తక్కువ సమయంలో అత్యంత సుందరంగా 'అండమాన్ ఆంధ్రావాణి'ని రూపొందించినందులకు శ్రీ గోటేటి శ్రీరామారావు గారి ఆంధ్రా అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

శ్రీ గోటేటి గారికి అండమాన్-నికోబార్ దీవులకు సాదరంగా ఆహ్వానించడానికి స్వాగత తోరణం, పుష్పగుచ్ఛాలతో పోర్టుబ్లెయిర్ ఎయిర్‌పోర్టుకు వెళ్లిన నాకు, తొలిసారిగా నా ఆత్మ బంధువును ప్రత్యక్షంగా చూసానన్న ఆనందంతో నా మనస్సు ఉబ్బి తబ్బిబ్బయ్యింది. ఆయన విమానం దిగి, దీవుల్లో కాలుమోపిన తొలి క్షణం నుండీ... చివరకు అదే ఎయిర్‌పోర్టు నుండి భారంగా వీడ్కోలు పలికేంతవరకూ... ఒక్క క్షణం కూడా తీరికనేది లేకుండా పోర్టుబ్లెయిర్‌లో ఆయన గడిపిన కొద్దిరోజులూ (4-5 రోజులు) ఆయన వెన్నంటి ఉండి వివిధ పర్యాటక ప్రదేశాలను చూపిస్తూ... వాటి గురించి విపులంగా విశదీకరించడం జరిగింది. ఆయన అండమాన్ పర్యటనలో భాగంగా 'అమరావతి కళాస్రవంతి' తరఫున కూడా ఆయన్ని ఉచితరీతిన సత్కరించడం జరిగింది. అంత బిజీ షెడ్యూల్‌లో కూడా నా ఆహ్వానాన్ని ప్రేమతో స్వీకరించి మా ఇంటికి కూడా వచ్చి మా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడమే కాకుండా, మేమిచ్చిన అచ్చ తెనుగు ఆంధ్ర విందు భోజనం ఆరగించడం మా ఇంటి సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది - మా అందరి హృదయాల్లో మధురస్మృతిగా నిలిచిపోయింది.



**ఉగాది వేడుకలు - 2002 సందర్భముగా ముఖ్య అతిథి మరియు ఆంధ్రా అసోసియేషన్ ప్రతినిధులతో శ్రీ గోటేటి**

శ్రీ గోటేటి శ్రీరామారావు గారు దేశ-విదేశాలెన్నో సందర్శించినప్పటికీ... స్వదేశంలో వుండి కూడా ఒక విదేశమనే అనుభూతిని కలిగించే ఈ అండమాన్ నికోబార్ దీవుల పర్యటన పూర్తి ప్రత్యేకత సంతరించుకుంది. ఆయన దీవుల సందర్శన అనుకున్నదానికంటే ఎక్కువ విజయవంతం కావడం ఆయనకే కాకుండా నాక్కూడా ఎప్పటికీ మరచిపోలేని తీయని జ్ఞాపకంగా హృదయపు టంచుల్లో నిలిచిపోయింది. దాంతో మామధ్య వున్న ఆత్మీయానుబంధం మరింత విస్తరించి ఒక కుటుంబ బాంధవ్యమై నిలిచింది. ఈ నేపథ్యంలోనే నేను సకుటుంబ సమేతముగా 14 ఏప్రిల్ 2004 నాడు చెన్నైలోని వారి స్వగృహానికి వెళ్ళి, ఆయన్ని - ఆయన కుటుంబ సభ్యులను కల్సుకోవడం జరిగింది. అప్పట్నుండీ ప్రతీ




*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

Bhimas Deluxe Hotel

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**

# ప్రముఖాంధ్ర

'ప్రముఖాంధ్ర'లో డి.భాస్కరరావు గురించి వచ్చిన కొన్ని శీర్షికలు

13 ప్రముఖాంధ్ర పుష్కర పూర్ణ వర్ష హర్ష విశేష సంచిక

## అండమాన్ దీవుల్లోని అమరావతి కళాస్రవంతి ఆంధ్రావతరణ వేడుకలు!

ఒక్క మహాత్ముడు మహాత్మాగాంధీ కారణంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఒక్క అపూర్వప్రాణి అమరజీవి పొట్టి శ్రీరాములు కారణంగా ఆంధ్ర రాష్ట్రమే గాకుండా, యావ దఖిల భారత భాషా రాష్ట్రములు వచ్చాయ్. ఒక్క టంగుటూరి ప్రకాశం ధీరత కారణంగా 'ఆంధ్ర కేసరి' అని బిరుదముతో 'ఆంధ్ర' శబ్దానికి విలువ పెరిగింది.



శ్రీ డి. భాస్కరరావు

అలా అలల మధ్య అలలాడుతూన్న అండమాన్ దీవుల్లోని, పోర్టుబ్లెయిర్ నీలిజల తీరాన 'నీలమణి'లా విభ్రాజిల్లుతూన్న 'హైడో' లోని అమరావతీ కళాస్రవంతి కారణంగా, ఆంధ్రము (భాష, సంస్కృతీ, జనసంప్రదాయం, కళలు) ఉప్పునీటి పాలు గాకుండా, నొప్పుగా, నొకే చేతితోనిలబెట్టుతూన్న నికార్సయిన తెలుగువాడు డి. భాస్కరరావు. కార్యదర్శి అంటారు గానీ, సర్వసౌభాగ్య భాగ్య తెలుగు కార్యముల క్రాంతదర్శి అతడు. దీవులలో తెలుగు దివిటీలు వెలుగుతున్నాయన్నా, తెలుగు కళాకారులు వెలుగుబాటలో ఉంటూన్నారన్నా, యీ దివ్వె దివ్య భాస్కరుడే కారణమేమో అనుకుంటా.

ఎక్కడ ఉత్తరాంధ్ర, ఎక్కడ శ్రీకాకుళ, విశాఖపట్నములూ – వాటిని వదిలి, అక్కడ భాషా, సంస్కృతిలను వదిలి, కడలి దాటి, కడలిమధ్యనే తన పీఠాన్ని (ఉద్యోగరీత్యా కానీ, ఉపాధి రీత్యాకానీ, ఆంధ్రోదయ రీత్యా గానీ) అండమాన్ దీవుల్లో బ్రహ్మాండంగా, అండపిండ బ్రహ్మాండములునేకపరుస్తూన్నట్టు, భారతగడ్డపై నున్న తెలుగు వారిని సహితమూ అండమాన్ రప్పించి, అందలమెక్కిస్తూన్నాడు. అలా చెన్నయ్ నుంచీ గగనమేఘాలపై నన్ను రప్పించి, సత్కరింపచేసి, తానూ సత్కరించి, దీవుల విభవాన్ని స్వయంగా చూపాడు, ప్రేమ చూపాడు, అనురాగం కురిపించాడు, అమృతం ఒలకించాడు. అమరావతీ కళాస్రవంతీ భాస్కర రావు భాస్కరరావే! అమరావతీ కళాకిరణం. ఓ నాటకం లేనిదే (అల్లూరి సీతారామరాజు అతనికి నచ్చిన పాత్ర, అందరూ మెచ్చిన పాత్ర) అతని కార్యక్రమం ఉండదు. పలు పెద్దల్ని సత్కరించనిదే అతనికి నిద్దుర ఉండదు. ఈమధ్య దీవులపై దివ్యమైన పరిశోధన చేశాడు, సాధన చేస్తున్నాడు. నికార్సయిన, నిస్వార్థమైన తెలుగువారి చరితలో అతనికీ ఓ పుట ఉంటుంది. ఆ వాస్తవమెప్పుడో స్ఫుటీకరింపబడింది. అతని అక్షరాలు రత్నాలు – అచ్చు యంత్రములు సహితమూ అతనితో పోటీపడలేవు. అచ్చు తెలుగులే పోటీపడలేవు అతనికీ, అతని కుటుంబ సభ్యులకూ, అమరావతీ కళాస్రవంతీ రేకులకీ, రేఖలకీ శుభాశీస్సులు. ●

## అండమాన్ భాస్కరుడు 'అమరావతి భాస్కరరావు'



ఒక్క తెలుగువాడు, రెక్కలతో డొక్కాడించుకొనేవాడు, హిందూ మహాసముద్రం మధ్యనున్న పోర్టుబ్లెయిర్‌లో చిన్న బిందువులా ఉన్నాడు. తనువంతా తెనుగుతో పునుగు రాసుకుని ఆ మాతృభాషా గుభాళింపులకు మురిసి, ఒరిసిపోతుంటాడు. నన్ను పోర్టుబ్లెయిర్ తీసుకుని వెళ్ళేదాకా నిదురపోలేదు. వెళ్లిన నేను నాలుగు రోజులున్నప్పటికినీ అతనికి తనువు తీరలేదు. వెళ్లినప్పుడు అతని కనుల కొలనులో ఆనందభాష్పాలూ, తిరుగు ప్రయాణం చేస్తూన్నప్పుడు అరుణారుణ నేత్రాల్లో ఆవేదనాశ్రువులు జాలువారాయ్. అండమాన్ దీవులన్నీ వత్తులు కట్టుకుని కొడిబారే జ్యోతుల్లా అవి బాధపడ్డాయ్.

అతనివద్ద డబ్బు లేదు. నెలజీతపు విత్తులే! చిత్తంలో మాత్రం తెలుగూ తెలుగూ నీవు వెలుగు. వెలుగునిచ్చే నిన్ను కరిగిపోనీను – అంటూ అమరావతీ కళాస్రవంతిని 25 సంవత్సరాల క్రితం ప్రారంభించి, తాను ఆర్థికంగా తరిగిపోతున్నాడు. సతీమణి అనారోగ్యంతో సతమతమవుతూన్నా, తెలుగుతల్లి సేవను విడనాడలేదు. ప్రతీ నవంబర్ 1నాడు అమరావతీ కళాస్రవంతి ద్వారా అండమాన్ దీవుల ఆంధ్రులకు రాష్ట్రావతరణం జ్ఞాపకం చేస్తూంటాడు. ఉత్సాహంతో ఉత్సవాలు చేస్తుంటాడు. ఉత్సాహం పెంచుతూంటాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండమాన్ ఆంధ్రులను మరిచినప్పటికినీ, ఆయన మాతృదేశాన్నీ, మాతృదేశ ప్రజల్నీ మరువలేదు. ఏ తెలుగు సంఘాలూ, సమాఖ్యలూ పెద్దలూ చేయని మాతృభాషా సేవ ఆయన చేస్తున్నాడు. ఆయన అండమాన్ దీవుల తెలుగు భాస్కరుడు. ఆయన పేరే డి.భాస్కరరావు. ఆ భాస్కరుణ్ణి గూర్చి వ్రాయవలసినదెంతైనా ఉంది, వ్రాక్రుచ్చినది కొంతే! ★

ప్రముఖాంధ్ర 29 జూలై 2005

ఈనాడు తమిళనాడు (17-04-2002) 5

## అండమాన్ ఉగాది వేడుకల్లో గోటేటికి ఘనసన్మానం



ఆంధ్రా అసోసియేషన్ పోర్టుబ్లెయిర్‌వారి ఉగాది పురస్కారం అందుకున్న గోటేటి శ్రీరామారావు.

శుభకార్యానికి మా ఇంటి పెద్దవలె ఆయన శుభాశీస్సులు అందుకుంటూ ఉండేవాడ్ని. ప్రళయ రక్కసి 'సునామీ' తాకిడిని తట్టుకుంటూ... 'అమరావతి కళాస్రవంతి' దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని ఒక ప్రత్యేక అభినందన సంచికను శ్రీ గోటేటి గారి సంపూర్ణ సహాయ–సహకారములతో గోటేటి గ్రాఫిక్స్‌లోనే రూపొందించి, 1 నవంబరు 2005న అండమాన్ నికోబార్ దీవుల పోలీసు డి.ఐ.జి,

'స్వాతి' మాసపత్రిక వార్త (జూన్ 2002)

సాహితీ సదస్సులు



అండమాన్ నికోబార్ దీవులకు చెందిన ప్రఖ్యాత తెలుగు సంస్థ ఆంధ్రా అసోసియేషన్‌వారు, పోర్టుబ్లెయిర్‌లో నిర్వహించిన ఉగాది-2002 వేడుకల సభకు గౌరవ అతిథిగా విచ్చేసి, సత్కారాన్ని అందుకుంటున్న 'ప్రముఖాంధ్ర' పత్రికా సంపాదకులు శ్రీ గోటేటి శ్రీరామారావు

శ్రీ ఎస్. వాసుదేవరావు ఐ.పి.ఎస్.గా చేతుల మీదుగా ఆవిష్కరించడం ఒక విశేషమైతే... ఆయన మార్గదర్శకత్వంలో (గైడ్)గా "అండమాన్ నికోబార్ దీవుల్లో – అమరావతి కళాస్రవంతి ఆవిర్భావం" అనే అంశంపై థీసెస్‌ను సమర్పించి – మీడియా మేనేజ్‌మెంట్ విభాగంలో నేను "యం.యస్" డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడ్ని కావడం మరో విశేషం.

ఇలా ఆయనతో నాకున్న ఆత్మీయానుబంధం చివరివరకూ నిరాటంకంగా కొనసాగింది. ముఖ్యంగా నాపై ఆయనకున్న ప్రత్యేకమైన ప్రేమాభిమానం, స్వంత మనుషులకు మించి చూపించే వాత్సల్యం, సదా వెన్నుతట్టి ముందుకు నడిపించే అమూల్యమైన ప్రోత్సాహకం, నిండు మనస్సుతో కురిపించే ఆశీర్వ వచనాల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఏది ఏమైనా ఆయనతో నాకున్న మధురానుబంధం కొనలేనిది, వెలకట్టలేనిది. ఏమిచ్చినా, ఎంతచ్చినా ఎన్నడూ తీర్చుకోలేనిది ఆయన ఋణం... కేవలం అశ్రునయనాలతో ఆయనకు ఘన నివాళులు అర్పించడం తప్ప.

– డి.భాస్కరరావు

విశ్వవ్యాప్తంగా తెలుగు భాషా పరిమళాలు విస్తరించడమే ప్రధాన ధ్యేయంగా, ఎటువంటి స్వలాభాపేక్ష లేకుండా గత ఇరవై అయిదేండ్లుగా నిరాటంకంగా, నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఈ మహాయజ్ఞం... ఉదారత్వంతో ఆదుకునే దాతల అండదండలతో... ఈ యజ్ఞం మరింత తేజోవంతమై కొనసాగాలని, అందుకు తగ్గ శక్తియుక్తులు మెండుగా ప్రసాదించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... రజతోత్సవ విశేష సంచిక విడుదల సందర్భముగా ఇవే నా శుభాభినందనలు.

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# బెజవాడ బందరు శ్లోకం

"బెజవాడ బందరు" శ్లోకం ఎప్పుడైనా విన్నారా అయితే ఈ శ్లోకం విని దాని అర్థం క్రింద చదవండి!!

**"బెరాని ఉత ఇందోగు నూక**
**వప్పెచిమాః క్రమాత్**
**స్టేషన్ను బెబం శాఖాయాం**
**నూక్రాస్యాదితి నిర్ణయః"**

ఒకసారి దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు బెజవాడ నుంచి బందరుకి రైల్లో వెడుతూ ఉండగా రెండు మూడు స్టేషన్లు దాటిన తర్వాత పక్కనున్నాయనని "తరువాత వచ్చే స్టేషన్ ఏమిటండీ?" అని అడిగారట. ఆయన "తరిగొప్పుల" అని చెప్పాడట.

కొంచెంసేపయిన తర్వాత మళ్ళీ "వచ్చే స్టేషన్ పేరు?" అని అడిగితే పక్కనున్నాయన సమాధానం "ఇందుపల్లి" అని. కాస్సేపయిన తరువాత మళ్ళీ ఇప్పుడు వచ్చే స్టేషనేమిటి" అని అడగ్గానే... ఆ ప్రక్కనే కూచున్న ఇంకొక ఆయనకి విసుగు పుట్టి,

"ఏవండీ మీకు సంస్కృతం వచ్చునా?" అని అడిగారట.

దువ్వూరివారు మహాపండితులు,

అప్పుడు ఆయన "ఏదో కొద్దిగా వచ్చులెండి" అని అన్నారు. అప్పుడు ఆ పక్కనున్నాయన "అయితే ఈ శ్లోకం రాసుకోండి – స్టేషన్ల పేర్లన్నీ గుర్తుంటాయి" అని ఇలా చెప్పాడట.

**"బెరాని ఉత ఇందోగు నూక**
**వప్పెచిమాః క్రమాత్**
**స్టేషన్ను బెబం శాఖాయాం**
**నూక్రాస్యాదితి నిర్ణయః"**

అప్పుడు శాస్త్రి గారు రాసుకుని చదువుకున్నారు.

**బె వ బెజవాడ**
**రా వ రామవరప్పాడు**
**ని వ నిడమానూరు**
**ఉ వ ఉప్పులూరు**
**త వ తరిగొప్పుల**
**ఇం వ ఇందుపల్లి**
**దో వ దోసపాడు**
**గు – గుడ్లవల్లేరు**
**నూ వ నూజెళ్ళ**
**క వ కవుతరం**
**వ వ వడ్లమన్నాడు**
**పె వ పెడన**
**చి వ చిలకలపుడి**
**మ వ మచిలీపట్నం**
**బెబం వ బెజవాడ బందరు మధ్య స్టేషన్లు**

కానీ **"నూక్రాస్యాత్"** అనే పదం అర్థం కాక ఏమిటి అని ఆ పక్కాయన్ని కదిపితే వెంటనే ఆయన

**"నూజెళ్ళలో క్రాసింగ్ అవుతుంది"** అని చెప్పి దిగిపోయాట్ట.

ఇంతకీ ఈ శ్లోకం చెప్పిన మహానుభావుడి నామధేయం మాత్రం ఎవరికీ తెలీదు...మీకు తెలిస్తే చెప్పండేం.

**'ఈనాడు' వార్త (17.03.2002)**

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

మొదటి పదం ఒక అక్షరం, రెండవ పదం రెండక్షరాలు, మూడవ పదం మూడక్షరాలు.... ఇలా ఇరవయ్యవ పదం ఇరవై అక్షరాలతో ఉన్నాయి.

దీనికి ప్రతిగా ఏల్చూరి మురళీధరరావు గారు వ్రాసిన తెలుగు వాక్యం.

"మిత్రవినోదంకరణగా మీకు విన్నవిస్తున్నాను; మేధావద్విశిష్టతకు కాదు ..." అని కూడా ప్రకటించారు.

"ఏ మంచి కవైనా విశ్వనాథ గ్రంథావళిని చదవకపోతే కవిత్వరచనలో పద్యనిర్మాణశక్తికి, సద్గుణాలంకారవ్యక్తికి,

రసోచితశబ్దార్థయుక్తికి, సుమకోమలభావభావనకు, నవ్యసంప్రదాయ పదగుంభనకు, భవ్యరసాస్వాదరసాయనవాణికి, పురుషార్థోచితచిత్తవృత్తిచిత్రణకు, భారతీయతామకరందాస్వాదలోలుతకు, అతిలోకచమత్కృతిమత్కృతిమత్ప్రతీతికి, విషయచింతానిరోధనిశ్చలసమాధ్యవస్థకు, విపంచీస్వరసౌభాగ్యబంధుర శయ్యావైయాత్యానికి, ఉత్కృష్టలోకసిద్ధార్థమహాపురుషగుణకీర్తనకు, రమణీయార్థనిర్మితశ్రవణమనోహరకావ్యలక్ష్మికి, నానార్థస్ఫోటవాచకత్వ సంయోగాదినియమితవ్యంజనకు, అభిధావివక్షితాన్యపరవాచ్యసం లక్ష్యక్రమభావధ్వనికి, శృంగారవీరకరుణహాస్యరౌద్రాద్భుతశాంతాదిరసప్రతీతికి, గిరిశిఖరపతన్నిరర్గళస్రవంతీనిరుపమానధారాశుద్ధికి, ధర్మజ్ఞానభక్తిప్రేమ సత్యాద్యుత్తమాదర్శప్రతిపాద్యవస్తుస్వీకృతికి, సహృదయహృదయవాసనా పరీపాకభావనాప్రపంచశోభాదూరవర్తే!

పై వాక్యంలో 26 పదాలున్నాయి. మొదటి పదం ఒక అక్షరం, రెండవ పదం రెండక్షరాలు, మూడవ పదం మూడక్షరాలు.... ఇలా ఇరవై ఆరవ పదం ఇరవైయారు అక్షరాలతో ఉన్నాయి.

1. ఏ
2. మంచి
3. కవైనా
4. విశ్వనాథ
5. గ్రంథావళిని
6. చదవకపోతే
7. కవిత్వరచనలో
8. పద్యనిర్మాణశక్తికి,
9. సద్గుణాలంకారవ్యక్తికి,
10. రసోచితశబ్దార్థయుక్తికి,
11. సుమకోమలభావభావనకు,
12. నవ్యసంప్రదాయపదగుంఫనకు,
13. భవ్యరసాస్వాదరసాయనవాణికి,
14. పురుషార్థోచితచిత్తవృత్తిచిత్రణకు,
15. భారతీయతామరందాస్వాదలోలుపతకు,
16. అతిలోకచమత్కృతిమత్కృతిమత్ప్రతీతికి,
17. విషయచింతానిరోధనిశ్చలసమాధ్యవస్థకు,
18. విపంచీస్వరసౌభాగ్యబంధురశయ్యావైయాత్యానికి,
19. ఉత్కృష్టలోకసిద్ధార్థమహాపురుషగుణకీర్తనకు,
20. రమణీయార్థనిర్మితశ్రవణమనోహరకావ్యలక్ష్మికి,
21. నానార్థస్ఫోటవాచకత్వసంయోగాదినియమితవ్యంజనకు,
22. అభిధావివక్షితాన్యపరవాచ్యసంలక్ష్యక్రమభావధ్వనికి,
23. శృంగారవీరకరుణహాస్యరౌద్రాద్భుతశాంతాదిరసప్రతీతికి,
24. గిరిశిఖరపతన్నిరర్గళస్రవంతీనిరుపమానధారాశుద్ధికి,
25. ధర్మజ్ఞానభక్తిప్రేమసత్యాద్యుత్తమాదర్శప్రతిపాద్యవస్తుస్వీకృతికి,
26. సహృదయహృదయవాసనాపరీపాకభావనాప్రపంచశోభాదూరవర్తే!

# బ్రహ్మశ్రీ హానగళ్ విరూపాక్ష శాస్త్రి గారు



శృంగేరి జగత్‌గురువులైన చంద్రశేఖర భారతీ మహాస్వామివారి తర్క, వేదాంత గురువులు. వీరు అతిచిన్న వయస్సులోనే శంకర భాష్యాన్ని ఆపోసన పట్టి మహాపండితులకే భాష్యపాఠం చెప్పేరు. శ్రీవిద్యా మంత్రశాస్త్రధురీణులు.

సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ మహాస్వామివారి దెగ్గర మంత్రరహస్యములను గ్రహించి వారి వద్దనే శ్రీవిద్యా సమన్వయ క్రమాన్ని సమయాచార పద్ధతిలో గ్రహించి సాక్షాత్తు శారదాంబ తో అద్వైతభావాన్ని అనుసంధానము చేసుకునే వారు. తర్వాత సన్యసించి కూడలి మఠానికి పీఠాధిపతి అయ్యి విదేహముక్తులైనారు.

ఒకేసారి ఇద్దరు తర్కశిష్యులకి గదాధర భట్ట న్యాయము మరియు జగదీశభట్ట న్యాయము చెప్పేవారు. స్నానము చేస్తూ వ్యాకరణ భాష్యము చెప్పేవారు.

వీరి సదాచారాన్ని కొనియాడాలి అంటే 1000 ముఖములు చాలవు. వీరు తన జీవితములో విత్తాన్ని (డబ్బుని) ఎప్పుడు ముట్టుకోలేదు. మైసూర్ సంస్థానం నుంచి నెలకి కాస్త జీతము వొస్తే అది తన ఇంటిపక్కనే ఉన్న కిరాణా షావుకారిని పిలిచి డబ్బు తీసుకోమనే వారు. ఆ షావుకారు సరుకులు వారి ధర్మపత్నిని అడిగి వేసేవాడు. వారు మాత్రము నిత్యమూ అనుష్ఠానము, భాష్య పాఠము మరియు అధ్యాపనములో కాలం గడిపేవారు. శాస్త్రపుస్తకాల మీద చాలా గౌరవము ఉండేది. ఎప్పుడు పుస్తకాలని కిందపెట్టనిచ్చే వారు కాదు. వ్యాసపీఠము మీద ఉండాలి అనే వారు.

సోమవారం ఏకాదశ రుద్రాభిషేకము మరియు ఆదివారము అరుణము, సూర్యనమస్కారం – ఇవి తన ఆశ్రమస్వీకారం చేసేవరకు ఆచరిస్తూ వొచ్చేరు.

ఎవరైనా శంకరభాష్యము నేర్చుకుందామని వొస్తే మొట్టమొదట వారు అడిగే ప్రశ్న "సంధ్యావందనము 3 పూటలా చేస్తున్నావా ? బ్రహ్మయజ్ఞం చేస్తున్నావా?" అని. వారికి నమ్మకం కుదిరితే పాఠం మొదలుపెట్టేవారు.


వీరు బెంగుళూరులో ఉండేవారు. సంవత్సరానికి ఒక్కసారి వీరు కాలడి మరియు శృంగేరి తీర్థయాత్రకి వెళ్లేవారు. శిష్యులు రైలుబండి టికెట్ చేతికి ఇచ్చేవారు...వీరు ఏ బండిలో ప్రయాణము చేస్తే ఆ బండికి సంబంధించిన సిబ్బందికి (స్టేషన్ మాస్టారు, గార్డు, ఇంజిన్ డ్రైవర్) instructions వొచ్చేవి. సాయంకాలము సంధ్యావందనానికి (సరిగ్గా 6:00) ఏ స్టేషన్ వొస్తే ఆ స్టేషన్ లో బండి ఆగేది ...వీరు స్టేషన్ దెగ్గర కొళాయి దెగ్గరికి వెళ్లి , కాళ్ళు–చేతులు కడుక్కుని ఆచమనము చేసి అర్ఘ్యము విడిచిన తరవాత బండి ఎక్కేవారు. ఆ తరువాత బండి కదిలేది.

ఇది వారి అనుష్ఠాన బలం ....నియమం తప్పక స్వధర్మాన్ని ఆచరిస్తే ప్రపంచము దాసోహం అవుతుంది అనే సత్యాన్ని నిరూపించేరు బ్రహ్మశ్రీ విరూపాక్ష శాస్త్రి గారు. ●

# 'ఆహారం'. గురించి ప్రముఖుల, మహాత్ముల అభిప్రాయాలూ, అనుభవాలూ!

1. ఆకలిగొన్నవాడికి ' దేవుడు ' కనపడేది అన్నం రూపంలోనే! **(మహాత్మా గాంధీ)** .
2. "నేను వంటింట్లోకి వేరే పనిమీదవెళ్ళినాకూడా, వంట చేస్తున్న మా అమ్మగారు. "పెట్టేస్తా నాన్నా ఒక్క అయిదు నిముషాలు" అనేవారు నొచ్చుకుంటూ– నేను అన్నం కోసం వచ్చాననుకుని! ఎంతయినా అమ్మ అంటే అన్నం. అన్నం అంటే అమ్మ! అంతే! **(జంధ్యాలగారు)**.
3. మంచి భోజనం లేని పెళ్ళికి వెళ్ళటం – సంతాపసభకి వెళ్ళినదానితో సమానం! **(విశ్వనాథ సత్యనారాయణ గారు)**.
4. రాళ్లు తిని అరిగించుకోగల వయసులో వున్నప్పుడు తినటానికి మరమరాలు కూడా దొరకలేదు ! వజ్రాలూ, వైడూర్యాలూ పోగేసుకున్న ఈ వయసులో మరమరాలు కూడా అరగట్లేదు! అదే విధి! **(రేలంగి వెంకట్రామయ్య గారు)**.
5. ఆరురోజుల పస్తులవాడి ఆకలి కన్నా, మూడురోజుల పస్తులవాడి ఆకలి మరీ ప్రమాదం! ఆహారం దొరికినప్పుడు ముందు వాడ్నే తిననివ్వాలి! **(ముళ్ళపూడి వెంకటరమణ గారు)**.
6. ఏటా వందబస్తాల బియ్యం మాకు ఇంటికి వచ్చినా మా తండ్రిగారు "అన్నీ మనవికావు నాయనా" అని బీదసాదలకి చేటలతో పంచేసే వారు. అన్నీ మనవికావు అనటంలో వున్న వేదార్థం నాకు పెద్దయితేనేగానీ అర్థం కాలేదు ! **(ఆత్రేయ గారు)**
7. అమ్మకి నేను అన్నం పెడుతున్నాను అనటం మూర్ఖత్వం! అమ్మ చేతి అన్నం తింటున్నాను అని చెప్పగలిగినవాడు ధన్యుడు ! **(చాగంటి కోటేశ్వరరావుగారు)**.
8. ఆకలితో వున్న వాని మాటలకు ఆగ్రహించవద్దు !! **(గౌతమ బుద్ధుడు)**.
9. ఆత్మీయులతో కలసి తినే భోజనానికి రుచి ఎక్కువ! చారు కూడా అమృతంలా రుచిస్తుంది! **(మాతా అమృతానందమయి)**.
10. మీ పిల్లలు ఎంతదూరంలో, ఎక్కడవున్నా, వేళపట్టున ఇంత అన్నం తినగలుగు తున్నారంటే అది వాళ్ళ గొప్పాకాదూ, మీ గొప్పాకాదు మీ పూర్వీకుల పుణ్యఫలమే అని గుర్తించు ! ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# ఆహారం

అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు.

మనలోని జీవశక్తిని పెంపొందించేది అన్నం.

అయితే, ఈ అన్నాన్ని ఏ విధంగా, ఎక్కడ, ఎవరు వండి వడ్డిస్తున్నారన్న విషయం కూడా చాలా ముఖ్యమైనది. అందువలననే పూర్వకాలంలో మడి, ఆచారాల విషయంలో ఖచ్చితంగా వుండేవారు. మనం తీసుకునే ఆహారంలో ఐదు విధాలైన దోషాలు నిమిడివున్నాయి.

అర్ధ దోషం, నిమిత్త దోషం, స్థాన దోషం, గుణ దోషం, సంస్కార దోషం. ఈ ఐదు దోషాలను గుర్తించి స్వీకరించకపోతే ఎన్నో అనర్థాలు కలుగుతాయని పెద్దలు చెపుతారు.

### అర్ధ దోషం:

ఒక సాధువు తన శిష్యుని ఇంటికి భోజనానికి వెళ్ళాడు.

భోజనం చేస్తున్నప్పుడు ఎవరో ఒక వ్యక్తి వచ్చి ఆ శిష్యునికి ధనంతో వున్న మూటని ఇవ్వడం చూశాడు. భోజనం చేసి, సాధువు ఒక గదిలో విశ్రాంతి తీసుకోసాగాడు. ఆ గదిలోనే శిష్యుడు దాచిన డబ్బు మూట వుంది. హఠాత్తుగా సాధువు మనసులో ఒక దుర్బుద్ధి కలిగింది, ఆ మూటలో నుండి కొంచెం డబ్బు తీసుకుని తన సంచీలో దాచేశాడు. తరువాత శిష్యుని వద్ద సెలవు తీసుకుని, తిరిగి తన ఆశ్రమానికివెళ్ళి పోయాడు. మరునాడు పూజా సమయంలో తను చేసిన పనికి సిగ్గుతో పశ్చాత్తాపం చెందాడా సాధువు. తను శిష్యుని ఇంట్లో చేసిన దోషభూయిష్టమైన భోజనం వల్లనే తనకా దుర్బుద్ధి కలిగిందని రాత్రి ఆహారం జీర్ణమయి, ప్రొద్దుననే మలంగా విసర్జించబడిన తర్వాత మనసు నిర్మలమై పరిశుద్ధమైనట్టు అర్థం చేసుకున్నాడు.

వెంటనే తాను తస్కరించిన డబ్బును తీసుకొని శిష్యుని ఇంటికి వెళ్ళి జరిగినదంతా చెప్పి, ఆ డబ్బును తిరిగి ఇచ్చేశాడు. శిష్యుడిని ఎలాటి వృత్తి ద్వారా డబ్బు సంపాదిస్తున్నావని అడిగాడు.

శిష్యుడు తలవంచుకొని, "నన్ను క్షమించండి, స్వామి! యిది సన్మార్గంలో వచ్చిన డబ్బు కాదు. "అని తలవంచుకొన్నాడు.

ఈ విధంగా సన్మార్గంలో సంపాదించని డబ్బుతో కొన్న పదార్థాలతో, తయారు చేసిన ఆహారం భుజించడమే అర్ధ దోషం. మనం న్యాయంగా సంపాదించిన దానితోనే ఆహారం తయారుచేసుకుని, భుజించడం ముఖ్యం.

### నిమిత్త దోషం:

మనం తినే ఆహారాన్ని వండేవారు కూడా మంచి మనసు కలవారైవు ఇంటికి వారు సత్యశీలత కలిగి దయ, ప్రేమ కల మంచి స్వభావము కలిగిన వారిగా వుండాలి. వండిన ఆహారాన్ని క్రిమికీటకాలు, పక్షులు జంతువులు తాకకూడదు. ఆహారం మీద దుమ్ము, శిరోజాలు వంటివి పడ కూడదు. అపరిశుభ్రమైన ఆహారం మనసుకి అసహ్యత కలిగిస్తుంది. దుష్టులైన వారి చేతి వంట భుజిస్తే వారి దుష్ట గుణాలు అవతలివారికి కలుగుతాయి.

భీష్మాచార్యుల వారు కురు క్షేత్ర యుద్ధంలో బాణాలతో కొట్టబడి యుద్ధం ముగిసేవరకు అంపశయ్య మీద ప్రాణాలతోనే వున్నాడు. ఆయన చుట్టూ పాండవులు, ద్రౌపది శ్రీ కృష్ణుడు వున్నారు. వారికి భీష్ముడు మంచి మంచి విషయాలను బోధిస్తూ వచ్చాడు. అప్పుడు ద్రౌపదికి ఒక ఆలోచన కలిగింది.ఇప్పుడు ఇంత వివేకంగా ఆలోచిస్తున్న భీష్ముడు ఆనాడు దర్యోధనుడు నా వస్త్రాలు అపహరించమని దుశ్శాసనునికి, ఆదేశించినప్పుడు ఎందుకు ఎదిరించి మాటాడలేకపోయాడు? అని అనుకొన్నది.

ఆమె ఆలోచనలు గ్రహించిన భీష్ముడు 'అమ్మా! నేను అప్పుడు దుర్యోధనుని, ప్రాపకంలో వారిచ్చిన ఆహారం భుజిస్తూ వచ్చాను. నా స్వీయ బుద్ధిని ఆ ఆహారం తుడిచి పెట్టింది. శరాఘాతములతో, ఛిద్రమైన దేహంతో, ఇన్ని రోజులు ఆహారం తీసుకోనందున, పాత రక్తం బిందువులుగా బయటికి పోయి, నేను ఇప్పుడు పవిత్రుడినైనాను. నా బుద్ధి వికసించి, మీకు మంచి మాటలు చెప్పగలుగుతున్నాను అన్నాడు భీష్ముడు.

## శ్రీ ఆంజనేయం

కార్యసిద్ధిని చేకూర్చే శక్తివంతమైన అంజనేయ శ్లోకాలు... ఇవే హనుమంతుడు కార్యసాధకుడు. భక్తితో హనుమంతుడిని కొలిచిన వారికి వారి కోరికలు తప్పక నెరవేరతాయి. భక్తులు వారి వారి కోరికను అనుసరించి ఆంజనేయ శ్లోకాలను భక్తితో స్మరిస్తే కార్యసిద్ధి సాధించగలుగుతారు.



**1. విద్యా ప్రాప్తికి:-**

పూజ్యాయ, వాయుపుత్రాయ వాగ్దోష వినాశన!
సకల విద్యాంకురమే దేవ రామదూత నమోస్తుతే!!

**2. ఉద్యోగ ప్రాప్తికి :-**

హనుమాన్ సర్వధర్మజ్ఞ సర్వా పీడా వినాశినే!
ఉద్యోగ ప్రాప్త సిద్ధ్యర్థం శివరూపా నమోస్తుతే!!

**3. కార్య సాధనకు :-**

అసాధ్య సాధక స్వామిన్ అసాధ్యం తమకిమ్ వద!
రామదూత కృపాం సింధో మమకార్యమ్ సాధయప్రభో!!

**4. గ్రహదోష నివారణకు :-**

మర్కటేశ మహోత్సాహా స్రవ గ్రహ నివారణ!
శత్రూన్ సంహార మాం రక్ష శ్రియం దాపయామ్ ప్రభో!!

**5. ఆరోగ్యమునకు :-**

ఆయుః ప్రజ్ఞ యశోలక్ష్మీ శ్రద్ధా పుత్రాస్సుశీలతా!
ఆరోగ్యం దేహ సౌఖ్యంచ కపినాథ నమోస్తుతే!!

**6. సంతాన ప్రాప్తికి :-**

పూజ్యాయ ఆంజనేయ గర్భదోషాపహారిత్!
సంతానం కురమే దేవ రామదూత నమోస్తుతే!!

**7. వ్యాపారాభివృద్ధికి :-**

సర్వ కళ్యాణ దాతరమ్ సర్వాపత్ నివారకమ్!
అపార కరుణామూర్తిం ఆంజనేయం నమామ్యహమ్!!

**8. వివాహ ప్రాప్తికి :-**

యోగి ధ్యే యాం ఘ్రి పద్మాయ జగతాం పతయేనమః!
వివాహం కురమేదేవ రామదూత నమోస్తుతే!!

చెడ్డ గుణములు వున్న వారు ఇచ్చినది తిననందు వలన మనిషిలోని మంచి గుణములు నశించి 'నిమిత్త దోషం' ఏర్పడుతోంది.

### స్థాన దోషం :

ఏ స్థలంలో ఆహారం వండబడుతున్నదో, అక్కడ మంచి ప్రకంపనలు వుండాలి. వంట చేసే సమయంలో అనవసరమైన చర్చలు వివాదాల వలన చేయబడిన వంట కూడా పాడైపోతుంది. యుద్ధరంగానికి, కోర్టులు, రచ్చబండలు వున్న చోట్లలో వండిన వంటలు అంత మంచివి కావు.

దుర్యోధనుడు ఒకసారి యాభై ఆరు రకాల వంటలు వండించి శ్రీకృష్ణుని విందు భోజనానికి పిలిచాడు. కాని కృష్ణుడు దుర్యోధనుని పిలుపును నిరాకరించి, విదురుని ఇంటికి భోజనానికి వెళ్ళాడు. కృష్ణుని చూడగానే విదురుని భార్య సంతోషంగా ఆహ్వానించి ఉపచారాలు చేసింది. తినడానికి ఏమిటి పెట్టడం అని యోచించి, ఆనంద సంభ్రమాలతో తొట్రుపాటు పడిఅరటి పండుతొక్క ఒలిచి, పండు యివ్వడానికి బదులుగా తొక్కని అందించింది. కృష్ణుడు దానినే తీసుకొని ఆనందంతో భుజించాడు. ఇది చూసిన విదురుడు భార్య వైపు కోపంగా చూశాడు.

కృష్ణుడు, ''విదురా! నేను ఆప్యాయతతో కూడిన ప్రేమకోసమే ఎదురుచూస్తున్నాను. నిజమైన శ్రద్ధాభక్తులతో యిచ్చినది అది కాయైనా, పండైనా, ఆకైనా, నీరైనా, ఏది ఇచ్చినా సంతోషంగా తీసుకుంటాను.' అని అన్నాడు.

మనం ఆహారం వడ్డించినప్పుడు, ప్రేమతో వడ్డించాలి.

### గుణ దోషం :

మనం వండే ఆహారం సాత్విక ఆహారంగా వుండాలి. సాత్విక ఆహారం, ఆధ్యాత్మికాభివృద్ధిని కలిగిస్తుంది. రజోగుణం కలిగించే ఆహారం మనిషిని లౌకిక మాయలో పడేస్తుంది. స్వార్థాన్ని పెంచుతుంది తామస ఆహారం.

సర్వేజనాః సుఖినోభవంతు

# మధుర గాయకులు
# గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్



తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన విద్వాంసులు, మధుర గాయకులు, అద్భుత స్వరకర్త గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారు సంగీతానికి అంకితమైన ఒక పుంభావ సరస్వతి. 1948 నవంబరు 9 న రాజమహేంద్రవరం లో జన్మించారాయన. ప్రఖ్యాత నేపథ్య గాయని శ్రీమతి ఎస్.జానకి ఆయనకు స్వయానా పిన్నిగారు.

శ్రీయుతులు నేదునూరి, పశుపతి, మంగళంపల్లి గార్లు వీరికి గురువులైనా, గరిమెళ్ళవారి బాణి, ఈ ముగ్గురు త్రిమూర్తుల మేలు కలయిక అని చెప్పవచ్చు. నేదునూరివారిలోని రాగభావం, పశుపతిగారి గాత్రంలోని శ్రుతిశుద్ధం, బాలమురళివాణిలోని లాలిత్యం కలబోసిన బాణి వీరిది.

అన్నమయ్య చేసిన పదార్చనకు గరిమెళ్ళవారి రాగాలు 'బంగారానికి తావి' అనిపిస్తాయి. 150 కి పైగా రాగాలను తీసుకొని, 800 కు పైగా సంకీర్తనలకు వైవిధ్యభరితంగా బాణీలు కట్టిన ఘనత వారిది. ఆయన స్వరపరచిన అన్నమయ్య సంకీర్తన వింటుంటే, సాహిత్యం, దానికి తగ్గ సంగీతం జతగా కలసి,మెలసి, 'అన్నమయ్య మనతో మాటాడుతున్నారా!' అనిపిస్తుంది.

మోహన, హిందోళ, శుద్ధధన్యాసి వంటి రాగాలలో సాధారణంగా ఎవరు స్వరపరచినా పరిమితమైన అవే సంగతులు కనబడతాయి. కానీ గరిమెళ్ళవారు ఒకదానికొకటి భిన్నమైన స్వరప్రయోగాలతో, సాహిత్యంలో ఒదిగిపోయే విధంగా స్వరం సమకూర్చటం విశేషం. ఔడవ (5 స్వరాల) రాగాలలోనే ఆయన అధిక భాగం స్వరపరిచారు.

ఇక, ఆయన సృష్టించిన రాగాల విషయానికొస్తే సుందరరంజని, వాణీప్రియ, చిత్ర కల్యాణి వంటి రెండుపదుల రాగాలను, వినూత్న భావావిష్కరణలకు ఆలవాలమయేట్లు ఆయన సృజించారు.

ఆయనకు మృదంగ వాదనంలోను ప్రవేశం ఉంది...

తిరుమల తిరుపతి దేవస్థానముల రికార్డింగ్ ప్రాజెక్టు ఎక్స్పర్ట్ కమిటీ సభ్యుడినైన నా అనుభవంలో తెలుసుకున్నది ఏమంటే గరిమెళ్లవారు రూపొందించిన సిడిలకు కళ్లు మూసుకొని ఆమోదం తెలపటం తప్ప మరో ఆలోచన అనవసరం..అంత ప్రామాణికంగా ఉంటాయి అవి..

5000 కు పైగా విశ్వమంతా పర్యటించి, ఆయన నిర్వహించగా శ్రోతలు బ్రహ్మరథంపట్టిన ప్రదర్శనలు, 'అన్నమయ్య సంకీర్తన మహతి', 'అన్నమయ్య నాద జ్యోతి' వంటి లెక్కకు మిక్కిలియైన బిరుదాలు,

సమర్పించిన అసంఖ్యాక ఆడియో సీడీలు...ఇవన్నీ ఒక ఎత్తు అయితే, ఆయన రచించి, స్వరపరచి, గానంచేసిన లలితగీతాలు మరొక ఎత్తు. అవి నిజంగా ఆణిముత్యాలే... మధురభావ తరంగాలే...

గరిమెళ్ళవారు స్వరసహితంగా వెలువరించిన స్వీయ రచిత ఆంజనేయ కృతిమణిమాల, వినాయక కృతులు, నవగ్రహ కృతులు, సర్వదేవతా స్తుతి రచనలు...అనేకం బహుళ జనాదరణ పొందాయి.

గరిమెళ్ళవారి గళం వినబడని ఆకాశవాణికేంద్రం లేదు... భక్తిరంజని కార్యక్రమం లేదు.

దేశమంతటా పర్యటించి, 'అన్నమయ్య నాదయజ్ఞాలు' ఎన్నో విజయవంతంగా నిర్వహించారు.

తిరుమలకొండపై ఒక భక్తుడు స్వామి దర్శనార్థమై వచ్చి నిలుచున్నప్పుడు, ఏమూల ఉన్నా, ఏ చోటనున్నా, గాలి అలలపై తేలివచ్చే గరిమెళ్ళవారి గళం చెవికి సోకగానే, మధురానంద భరితుడవటం తథ్యం... తిరుమల తిరుపతి దేవస్థానానికి అంకితమైనారు గరిమెళ్లవారు...

వారి గాన కచేరీలెన్నో ప్రత్యక్షంగా విన్న భాగ్యవంతుణ్ణి. తాను ఏది పాడినా,ఆ పాటలోని ప్రతి మాటను, రాగంలోని ప్రతి సంగతినీ స్ఫటికమంత స్వచ్ఛంగా పలికించగల గంధర్వ గానం వారిది.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నిరాడంబర స్వభావి వారు. ఆయనకు నాతో పని ఉంటే, స్వయంగా రెండు మూడు సందర్భాలలో మా ఇంటికి స్వయంగా వచ్చి నన్ను కలసి, ఆశ్చర్యపరిచారు. తాను రచించిన ప్రతి గ్రంథాన్నీ ముందుగా నాకు అందచేసి,నా అభిప్రాయం తెలుసుకొనేవారు.

ఒకసారి బెజవాడలో అన్నమయ్య ఆరాధనలో నేను ఆయన సమక్షంలో అన్నీ ఆయన స్వరపరచిన సంకీర్తనలు పాడితే, ఆయన పొందిన ఆనందం వర్ణనాతీతం. ఆ ఆనందాన్ని అభినందన మందారమాలగా నాకు సమర్పించారాయన! తిరుపతిలో ఆయన హాజరుకాని నా కచేరీలు బహు కొద్ది మాత్రమే... నేనంటే అంత అభిమానం ఆయనకు!..

ఆయన పలుకు ఎంత మంద్రమో గానమంత మార్దవము. అనవసర విన్యాసాలకు, ఆడంబర విద్వత్ప్రదర్శనలకు ఆయన దూరంగా ఉంటారు.

అయితే, సాంప్రపాయాన్ని గౌరవిస్తూ ఆయన చేయని సంగీత, సాహిత్య ప్రక్రియ లేదు. శ్రోతలను తనతోపాటు తోడ్కొనివెళ్ళి, ఏడుకొండలూ ఎక్కించి, తుట్టతుదకు స్వామి దివ్యదర్శనం చేయిస్తుంది గరిమెళ్ళవారి గానం. అది అనన్యసామాన్యం.

'అన్నమయ్య కీర్తనలకు బాలకృష్ణప్రసాద్ గారి బాణీలకు సాటి మరిలేవు' అనటం అతిశయోక్తి కాదు. అందుకే గరిమెళ్ళవారు 'అన్నమయ్య వరప్రసాది'.

**– మొదుమూడి సుధాకర్**

*Compliments from*
**Sri Krishna Bhat**
**When you come to**
**Holy Pilgrimage Centre Tirupati & Tirumala**
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# బెజవాడ ఆలయంలో రాజద్వారం పై ఉండే ఈ పద్యం గురించి మీకు తెలుసా !?

అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల బెద్దమ్మ, సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ దుర్గ, మాయమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్!!

విజయవాడ కనకదుర్గమ్మ తల్లి కోవెలలో ఇప్పటికీ రాజద్వారం మీద ఈ పద్యం రాసి ఉంటుంది. ఈ పద్యం పైకి ఒకలా కనపడుతుంది. మీరు తెలిసికాని, తెలియకకాని పోతనగారు వ్రాసిన పద్యములు కొన్ని నోటికి వచ్చినవి మీరు చదివినట్లయితే అవి సత్ఫలితాలనే ఇచ్చేస్తాయి.

ఎందుకు అంటే మీరు కొన్ని కొన్ని చదవకూడదు. కొన్ని కొన్ని చేయకూడదు. పక్కన గురువు వుంటే తప్ప మేరువుని, శ్రీచక్రమును ఇంట్లోపెట్టి పూజ చెయ్యలేరు. అది మనవల్ల కాదు. మీరు బీజాక్షరములను ఉపాసన చెయ్యలేరు. అది కష్టం.

కానీ పోతనగారు ఈ దేశమునకు బహూకరించిన గొప్ప కానుక ఆయన రచించిన భాగవత పద్యములు.

'అమ్మలనుకన్న దేవతా స్త్రీలయిన వారి మనస్సుల యందు ఏ అమ్మవారు ఉన్నదో అటువంటి అమ్మని మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్ – ఈ నాలుగింటికోసము నమస్కరిస్తున్నాను.

అటువంటి దుర్గమ్మ మాయమ్మ. 'ఇవీ ఆయన ఈ పద్యంలో చెప్పిన విషయములు, మీరు చెయ్యలేని ఒక చాలా కష్టమయిన పనిని పోతనగారు చాలా తేలికగా మీకు ప్రమాదం లేని రీతిలో మీతో చేయించేయడాని కని ఇటువంటి ప్రయోగం చేశారు.



'అమ్మలగన్నయమ్మ' – అమ్మలని చెప్పబడ్డవారు ఎవరు? మనకి లలితాసహస్రం 'శ్రీమాతా' అనే నామంతో ప్రారంభ మవుతుంది. 'శ్రీమాతా' అంటే 'శ'కార 'ర'కార 'ఈ'కారముల చేత సత్వరజస్తమోగుణాధీశులయిన బ్రహ్మశక్తి, విష్ణుశక్తి రుద్రశక్తులయిన రుద్రాణి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి – ఈ ముగ్గురికీ అమ్మ – ఈ మూడు శక్తులను త్రిమూర్తులకు ఇచ్చినటువంటి పెద్దమ్మ అమ్మ ఎవరు వున్నదో ఆయమ్మ – అంటే 'లలితాపరాభట్టారికా స్వరూపం' – ఆ అమ్మవారికీ దుర్గాస్వరూపమునకు భేదం లేదు – అందుకని 'అమ్మలగన్నయమ్మ' 'ముగ్గురమ్మల మూలపుటమ్మ' – ఆ ముగ్గురు అమ్మలే మనం మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపములుగా కొలిచే తల్లులు. ఈ ముగురమ్మల మూలపుటమ్మ.

'చాల పెద్దమ్మ' – ఇది చాలా గమ్మత్తయిన మాట. చాల పెద్దమ్మ అనే మాటను సంస్కృతంలోకి తీసుకువెడితే మహాశక్తి – అండపిండ బ్రహ్మాండములనంతటా నిండిపోయిన బ్రహ్మాండమయిన శక్తిస్వరూపం. ఈ శక్తి స్వరూపిణి చిన్నపెద్దా భేదంలేకుండా సమస్త జీవరాశులలోను ఇమిడి ఉంది. అలా ఉండడం అనేదే మాతృత్వం. ఇది దయ. దీనిని సౌందర్యం అంటారు. దయకు సౌందర్యం అని పేరు. అది ప్రవహిస్తే సౌందర్యలహరి.

అండపిండ బ్రహ్మాండములనన్నిటినీ నిండిపోయి ఈ భూమిని తిప్పుతూ, లోకములనన్నిటినీ తిప్పుతూ ఇవన్నీ తిరగడానికి కారణమయిన అమ్మవారు ఎవరో ఆ అమ్మ.

'సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ' – సురారి అనగా దేవతలకు శత్రువయిన వాళ్ళ అమ్మ. అనగా దితి. దితి అయ్యో అని ఏడిచేటట్లుగా ఆవిడకు కడుపుశోకమును మిగిల్చింది. అనగా రాక్షసులు నశించడానికి కారణమయిన అమ్మ. దేవతలలో శక్తిగా ఈమె ఉండబట్టే రాక్షసులు మరణించారు.

'తన్నులోనమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ' – ఇదొక గొప్పమాట. అమ్మవారిని మనస్సులో నమ్ముకుని శక్తితో తిరుగుతున్న వారెవరు?

బ్రాహ్మి – మాహేశ్వరి – వైష్ణవి – మహేంద్రి

చాముండ – కౌమారి – వారాహి – మహాలక్ష్మి

మనకి సంప్రదాయంలో 'అష్టమాతృకలు' అని ఉన్నారు. వాళ్ళని మనం ఎనిమిది పేర్లతో పిలుస్తూ ఉంటాము. బ్రాహ్మి, మహేశ్వరి, వైష్ణవి, మహేంద్రి, చాముండ, కౌమారి, వారాహి, మహాలక్ష్మి.

ఇలా ఎనమండుగురు దేవతలు ఉన్నారు. వీరిని 'అష్టమాతృకలు' అని పిలుస్తారు. ఈ అష్టమాతృకలు శ్రీచక్రంలో దేవతలుగా ఉంటారు. వీరు నిరంతరము అమ్మవారిని లోపల కొలుస్తూ, అమ్మవారి వలన శక్తిని పొంది మనని ఉద్ధరిస్తూ ఉంటారు. ఈ ఎనమండుగురునే మనం కొలుస్తూ వుంటాము.

'రక్తాంబరాం రక్తవర్ణాం రక్త సౌభాగ్యసుందరాం వైష్ణవీం శక్తిమద్భుతాం'

అంటారు దేవీభాగవతంలో వ్యాసభగవానుడు. ఈ ఎనమండుగురికీ శక్తినిచ్చిన అమ్మవారెవరో ఆవిడే వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ – దుర్గమాయమ్మ – ఈ దుర్గమ్మ ఉన్నదే లలితా పరాభట్టారిక – ఆవిడ లలితా పరాభట్టారిక – ఆ అమ్మ మాయమ్మ.

'మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్' – ఇప్పుడు ఆవిడ నాకు దయతో మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదలను ఇవ్వాలి. నాకు అర్హత ఉన్నదని ఇవ్వనక్కరలేదు. దయతో ఇచ్చేయ్యాలి.

అమ్మవారికి 'శాక్తేయప్రణవములు' అని కొన్ని బీజాక్షరములు ఉన్నాయి. ఓం ఐం హ్రీం శ్రీం క్లీం సౌః – ఈ ఆరింటిని శాక్తేయ ప్రణవములు అని పిలుస్తారు. దానిని ఎలాబడితే అలా ఉపాసన చెయ్యకూడదు. కాబట్టి బీజాక్షరములను అన్నివేళలా ఉపాసన చేయలేము. కానీ ఇప్పుడు పోతనగారు ఒక గొప్ప ప్రయోగం చేశారు. మహత్త్వమునకు బీజాక్షరము 'ఓం', కవిత్వమునకు బీజాక్షరము 'ఐం', పటుత్వమునకు భువనేశ్వరీ బీజాక్షరము "హ్రీం", ఆ తర్వాత్ సంపదల్ – లక్ష్మీదేవి – 'శ్రీం'.

ఇపుడు 'ఓంఐంహ్రీంశ్రీం' – అమ్మలగన్నయమ్మ 'శ్రీమాత్రే నమః'

మీరు బీజాక్షరములతో అస్తమానూ అలా అనడానికి వీలులేదు. కానీ మీరు రైలులో కూర్చున్నా, బస్సులో కూర్చున్నా స్నానం చెయ్యకుండా కూడా ఎక్కడ ఉన్నా కూడా – అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ – అంటున్నారనుకోండి అపుడు మీరు మరోరూపంలో 'ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రేనమః' – 'ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రేనమః' అనేస్తున్నారు.

మీరు అస్తమానూ అమ్మను తలచుకున్నట్లు అవుతుంది. అపుడు అమ్మవారు చాలా తొందరగా మీకు పలుకుతుంది. అందుకే లలితా సహస్రం 'శ్రీమాతా' అంటూ అమ్మతనంతో ప్రారంభమవుతుంది.

ఆవిడ రాజరాజేశ్వరి. అయినా ఆవిడముందు అమ్మా అమ్మా అనేసరికి ఆవిడి పొంగిపోతుంది. ఇన్నిమార్లు ఆ పద్యంద్వారా అటూ ఇటూ అమ్మని మీరు పిలుస్తుంటే విసుక్కోవడం చేతకాని దయాస్వరూపిణి అయిన అమ్మ మీకోరికను తీరుస్తుంది. ఇప్పుడు మీరు 'ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః' అనలేకపోవచ్చు.

కానీ 'అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ' అనడానికి కష్టం ఏమిటి?

ఈవిధంగా పోతనగారు శ్రీవిద్యా రహస్యములన్నిటిని ఔపోసనపట్టి తెలుగు వారందరికీ ఒక మహత్తరమయిన కానుకను బహూకరించిన మహాపురుషుడు ఆయన ఒక ఋషి. అందుకని ఆ పద్యమును అనుగ్రహించినారు.

ఆ తల్లి అనుగ్రహం అందరికీ లభించాలని ప్రార్థిస్తూ....

సర్వేజనా సుఖినోభవంతు ..

## జి.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

సత్సంకల్పం, నిష్పక్షపాతం మరియు అఖండప్రేమ అనేవి ప్రపంచాన్ని జయించగలవు. ఈ సుగుణాలు ఉన్న వ్యక్తి లక్షలకొద్ది కపటుల, పశు సమానుల కుతంత్రాలను వమ్ము చేయగలడు.

- స్వామి వివేకానంద




# నాన్నంటే నిస్వార్థం



భారతదేశమంతా పర్వదినంగా కొలిచే కార్తీక పౌర్ణమి నాడు మా పెద్దాయన జ్యోతి రూపంగా ఆ భగవంతునిలో ఐక్య మయ్యారు. సరిగ్గా 2018 కార్తీక మాసం పౌర్ణమి రోజున ఆయన భౌతికంగా మమ్మల్ని విడిచివెళ్ళారు. అదే కార్తీక మాసం పౌర్ణమి 12-11-2019. ఇలా చూస్తుండగా సంవత్సరం గడిచింది. ఆయన చేసిన కృషి అంతా ఇంతా కాదు. పెద్ద పెద్ద సంస్థలు, వ్యక్తులు కూడా చేయటానికి సాహసించని మహత్కార్యం. తెలుగు భాషా సేవ. తెలుగుతల్లి ముద్దు బిడ్డలను ప్రపంచం అంతటా పరిచయం చెయ్యటం. తెలుగు భాషలోని సొబగులను మంచి పరిమళపు గుభాళింపుతో ప్రపంచానికెరుకపరచటం. ఇవన్నీ తన స్వంత ఖర్చుతోనే. ఆయన స్నేహితుల ఆదారాభిమానాలతోనే, తన జీవితపు చివరి ప్రయాణంలో కూడా ఆయన కోరిక ఆ పత్రికను తన తదనంతరము తీసుకురావాలనీ. ఆసుపత్రిలో కూడా నాలుగు మాటలు కాగితాలపై వుంచిన మహానుభావుడు. అటువంటివారిని నేనెప్పుడూ ఎక్కడా వినలేదు. కనలేదు. ఆయన వున్న ఒక సభలో నేను నాశక్త్యాను సారం ప్రముఖాంధ్రను నాలుగు పేజీలన్నా తీసుకువస్తావని మాట ఇచ్చాను. ఆ మాటను ఇంతవరకు నిలుపుకుంటూ వున్నాను.

అంతేకాదు కుటుంబంలో ప్రతివ్యక్తి కోసం ఆరాటపడేవారు. ఎవరి కోరిక ఏమిటో, ఎవరెవరు ఏమేమి కావాలనుకుంటున్నారో, ఎక్కడ చదవాలనుకుంటున్నారో, ఏమి చదవాలనుకుంటున్నారో అవన్నీ ఆయన బాధ్యతగా తెలుసుకుని వాటిని సమకూర్చేవారు. వయసు వ్యత్యాసం లేకుండా ఇంటిలోని వారందరూ ఆయనతో కలిసిమెలసిపోయి నవ్వుతూ, నవ్విస్తూ, కవ్విస్తూ లాలిస్తూ, ప్రేమిస్తూ వుండేవారు.

ఆయన 2017 జూన్‌లో అమెరికా వెళ్ళారు. మూడు నెలలు వున్నారు. ఆ మూడు నెలలలో నాకు నాలుగు వుత్తరాలు రాశారు. ఆ వుత్తరాల సారాంశం నువ్వు వారం వారం ఫోన్ చేసినా నాకు తృప్తి వుండదురా. ఒక ఉత్తరం రాయి.


క్షేమం న్యూజెర్సీ
2-6-2017

శ్రీమత్ చిరంజీవి వేంకటేశ్వరునకు దీవించి వ్రాయునది

ఎంతగా ఫోనులో మాట్లాడినప్పటికీ ఉత్తరం ద్వారా కుశలములు తెలిపినను సంతృప్తి కలుగదు. చి॥ల॥సౌ॥ లలిత, ..., విశేష్, ఆద్య, శ్రేయలు క్షేమంగా ఉన్నారని తలుస్తాను. శ్రేయకు మంచి కళాశాలలో సీటు దొరుకుతుంది. ధైర్యముగా ఉండమని చెప్పండి. మా నివాసం యొక్క ప్రభావం ... ఉండకుండా ఉండదు. ...

పదే పదే చూసుకుని చదువుకుంటూ వుంటాను అనేవారు. కాని నేను ఆయన కోరికను తీర్చనేలేదు. ఉత్తరం రాయలేదు. కాని ఇప్పుడు రాయాలనిపించింది. ఇదిగో రాస్తున్నాను. ఇది ఆయనకు చేరుతుందని నా నమ్మకం. ఆయన పదే పదే చదువుతారని...

పూజ్యనీయులైన నాన్నకు వెంకటేశు నమస్కరించి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. నేను తమ్ముళ్ళు, లలిత, మా అందరి పిల్లలు క్షేమం. మీరు కష్టించి, శ్రమించి **24** సంవత్సరాలుగా తీసుకువచ్చిన ప్రముఖాంధ్ర మీ కోరిక మేరకు **25**వ సంవత్సరం ప్రతినెలా క్రమం తప్పకుండా తీసుకువస్తూనే వున్నాను. మీకు అత్యద్భుతమైన స్నేహితులు వున్నారు. వారందరూ కూడా పత్రికను నడపమనీ సలహా ఇచ్చారు. కొంతమంది ఎప్పటిలాగానే మా సహాయం వుంటుందని తెలియపరిచారు. మా అందరికి మీరెప్పుడూ గుర్తుకు వస్తూనే వున్నారు. అరవై ఏళ్ళు వయసొచ్చిన నా నుండి, రెండేళ్లవయసున్న మీ మునిమనుమరాలు వరకూ అందరూ మిమ్మల్ని ప్రతినిత్యం తలుచుకుంటూనే వున్నాం. మీరిలా మా అందరి హృదయాలలో సజీవంగా వున్నారు. అనురాగానికి చిరునామా మీహృదయం. మీరు నడిచిన ప్రతి అడుగు మాకు ఆదర్శం. నడచిన ప్రతి దారి సదాశయం, చేరిన ప్రతి గమ్యం స్ఫూర్తి శిఖరం. మీరు మాకు మార్గదర్శి. మీ ప్రేమానురాగాలతో మా అందరికి వెలుగునిచ్చి జీవనజ్యోతిగా ఆఖరువరకు దారి చూపారు. అలసిసొలసిపోయి విశ్రమించిన మీకు, మీ పాదాలకు మా హృదయ నివాళులర్పిస్తూ మా ఉన్నతికి అహర్నిశలూ కృషి చేసి, మమ్మల్ని ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దిన మీరు మా నుండి భౌతికంగా దూరమైనా ఎప్పటికీ మా హృదయాలలో కొలువుంటారు. మంచికి మమతానురాగాలకి మారు పేరు మీరు. మీ మధుర జ్ఞాపకాలు మరువలేను. మీరు ముళ్ళబాటలో నడిచినా, మాకు పూలబాట అమర్చారు.

ఇంతకన్నా నా కలం ముందుకు సాగటం లేదు.

మీ

వెంకటేశు